తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | మంగళవారం - 12 - మే - 2026 | సంపుటి : 3 | సంచిక : 344 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



# నిరుపేద పిల్లలకు నాణ్యమైన విద్యే ప్రభుత్వ లక్ష్యం

## ప్రభుత్వ పాఠశాలలను అమ్మ ఒడిలా తీర్చిదిద్దుతాం

## విద్యా రంగంలో తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలబెడతాం

## విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందన్న సీఎం

**హైదరాబాద్, మే 11 (తెలంగాణ ముచ్చట్లు):** నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను వెనక్కి తగ్గకుండా అమలు చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన విద్యా వారోత్సవాల్లో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖ ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. కోర్ అర్బన్ ఏరియాలో రూ.1011 కోట్లతో నిర్మించనున్న "యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల"కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలను అనాథలుగా చూడబోమని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఎంత జాగ్రత్తగా చూసుకుంటారో అదే రీతిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను చూసుకోవడమే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. పాఠశాలలు దేశ భవిష్యత్తు నిర్మాణ వేదికలని, ఆ వేదికలను పునరుద్ధరించే ప్రక్రియను ప్రారంభించామని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా విద్యా రంగంలో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయని సీఎం వివరించారు. సిలబస్ మారుతోందని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావం పెరుగుతోందని, జాతీయ విద్యా విధానం మార్పులకు అనుగుణంగా తెలంగాణలో కూడా కొత్త విద్యా విధానం అమలు చేస్తున్నామని తెలిపారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు సమగ్ర విద్యా విధానం అమలు చేయబోతున్నామని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు విద్యార్థులకు బలవర్ధక ఆహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు. ప్రభుత్వ బడులు పిల్లలకు అమ్మ ఒడిలా ఉండాలని, వారికి ఎలాంటి ఇబ్బందులు రాకూడదని పేర్కొన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేయనున్నట్లు తెలిపారు.

మిగతా 2లో..



# కార్మికుల సంక్షేమమే ప్రజాపాలన ధ్యేయం

## కనీస వేతనాల సవరణపై కేబినెట్ సబ్ కమిటీ విస్తృత సమీక్ష

## పెరుగుతున్న జీవన వ్యయానికి అనుగుణంగా శాస్త్రీయ వేతన విధానం

## కార్మికులకు గౌరవప్రద జీవనం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

**హైదరాబాద్, మే 11 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్రంలోని కార్మికుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఇందిరమ్మ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్రంలో కనీస వేతనాల సవరణపై సోమవారం హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్లో కేబినెట్ సబ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్మికుల సంక్షేమం, పెరుగుతున్న జీవన వ్యయం, కొత్త వేతన విధానాలపై ఈ సమావేశంలో విస్తృత చర్చ జరిగింది.

ఈ సమావేశంలో మంత్రులు గడ్డం వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, లేబర్ కమిషనర్ దాసరి హరిచందన, ఫైనాన్స్ అండ్ ప్లానింగ్ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న కనీస వేతన విధానాలను కూలంకషంగా పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న కొత్త లేబర్ కోడ్ ప్రభావం తెలంగాణపై ఎలా ఉండబోతోందనే అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. కార్మికులకు చట్టపరమైన రక్షణ, ఉద్యోగ భద్రత, జీవన ప్రమాణాల పెంపు వంటి అంశాలపై అధికారులు నివేదికలు సమర్పించారు.

ప్రస్తుతం పెరుగుతున్న ధరలు, ద్రవ్యోల్బణం, నిత్యావసర సరుకుల వ్యయం దృష్ట్యా వేతనాలు కూడా కాలానుగుణంగా పెరగాల్సిన అవసరం ఉందని కమిటీ అభిప్రాయపడింది. కార్మికుల వేతనాలను కేవలం సంఖ్యల పరంగా కాకుండా వారి కుటుంబ అవసరాలు, పిల్లల విద్య, వైద్య ఖర్చులు, గృహ వ్యయం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయించాలని సమావేశంలో చర్చించారు. తెలంగాణలో శాస్త్రీయ విధానంలో కనీస వేతనాలను నిర్ణయించాలని ప్రభుత్వం భావిస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న ఉత్తమ వేతన నమూనాలను అధ్యయనం చేసి తెలంగాణకు అనుకూలమైన విధానాన్ని రూపొందించనున్నట్లు చెప్పారు.

మిగతా 2లో..




# వన్యప్రాణి సంరక్షణపై ప్రత్యేక వర్క్‌షాప్

- **"షేర్డ్ స్ట్రైప్స్ – షేర్డ్ ఫ్యూచర్" కార్యక్రమంలో గవర్నర్ పాల్గొనిక**
- **తెలంగాణ వన్యప్రాణి వారసత్వాన్ని ప్రతిబింబించిన ఫోటో ప్రదర్శన**
- **పెద్ద పిల్లి జాతుల సంరక్షణపై అవగాహన కార్యక్రమం**

**హైదరాబాద్, మే 11 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలో పెద్ద పిల్లి జాతుల సంరక్షణపై అవగాహన పెంపొందించేందుకు నిర్వహించిన "షేర్డ్ స్ట్రైప్స్ - షేర్డ్ ఫ్యూచర్" వర్క్‌షాప్‌లో తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్క్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ, తెలంగాణ అటవీ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈ వర్క్‌షాప్ నిర్వహించారు. తెలంగాణలోని వన్యప్రాణి సంపద, ముఖ్యంగా పెద్ద పిల్లి జాతుల సంరక్షణ, జీవ వైవిధ్య పరిరక్షణపై ఈ కార్యక్రమంలో విస్తృత చర్చ జరిగింది.

ఈ సందర్భంగా గవర్నర్ తెలంగాణకు చెందిన వన్యప్రాణి వారసత్వాన్ని ప్రతిబింబించే ప్రత్యేక ఫోటో ప్రదర్శనను ప్రారంభించారు. రాష్ట్రంలోని పులులు, చిరుతలు తదితర పెద్ద పిల్లి జాతుల జీవన విధానం, అడవి సంపద, ప్రకృతి సౌందర్యాన్ని చూపించే చిత్రాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. వన్యప్రాణుల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని ఆమె పేర్కొన్నారు.

మిగతా 2లో..



# ఖరీఫ్ 2026కు తెలంగాణ సన్నద్ధం

- **యూరియా నిల్వలు, నానో యూరియాపై మంత్రి తుమ్మల సమీక్ష**
- **మే చివరినాటికి 3.50 లక్షల మెట్రిక్ టన్నుల బఫర్ స్టాక్ లక్ష్యం**
- **ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు అమ్మితే కఠిన చర్యల హెచ్చరిక**

**హైదరాబాద్, మే 11 (తెలంగాణ ముచ్చట్లు):** రానున్న ఖరీఫ్ 2026 సీజన్‌కు తెలంగాణను పూర్తిస్థాయిలో సిద్ధం చేసే దిశగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. యూరియా సరఫరా, బఫర్ నిల్వలు, నానో యూరియా వినియోగం, ఎరువుల లభ్యత వంటి అంశాలపై ఎరువుల కంపెనీల ప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులతో విస్తృతంగా చర్చించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1.46 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్‌తో పాటు సుమారు 10 వేల మెట్రిక్ టన్నుల డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల నిల్వలు ఉన్నాయని మంత్రి తెలిపారు. ఖరీఫ్ సీజన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని 11.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించాలని కోరగా, కేంద్రం 10 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కేటాయించిందని వెల్లడించారు. ఏప్రిల్ నెలకు కేటాయించిన 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాలో కేవలం 1.53 లక్షల మెట్రిక్ టన్నులే రాష్ట్రానికి చేరాయని అధికారులు మంత్రికి వివరించారు. మే నెలలో ఇప్పటివరకు 48,985 మెట్రిక్ టన్నుల యూరియా

మిగతా 2లో..



# ప్రతి గింజను కొనుగోలు చేస్తాం

- **వరి, మొక్కజొన్న కొనుగోళ్లపై మంత్రి జూపల్లి సమీక్ష**
- **రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు**
- **కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు**

**నాగర్‌కర్నూల్, మే 11 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రస్తుత సీజన్‌లో రైతులు పండించిన వరి ధాన్యం, మొక్కజొన్నను పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు హామీ ఇచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో అధికారులు, మిల్లర్లతో కలిసి ఆయన కొనుగోలు ఏర్పాట్లపై చర్చించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వరి ధాన్యం, మొక్కజొన్న సేకరణలో ఆలస్యం జరగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నామని మంత్రి వెల్లడించారు. గ్రేడింగ్, తూకం, రవాణా ప్రక్రియల్లో జాప్యం జరగకుండా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. రైతులు ధాన్యం తీసుకొచ్చిన వెంటనే కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసేలా

మిగతా 2లో..

# బండి భగీరథ్ పోక్సో కేసుపై సీఎం రేవంత్ ఆగ్రహం

- **డీజీపీని ప్రశ్నించిన ముఖ్యమంత్రి**
- **ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేయాలని ఆదేశం**
- **కేసుపై స్పందించిన బాలల హక్కుల కమిషన్**

**హైదరాబాద్, మే 11 (తెలంగాణ ముచ్చట్లు):** కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పై నమోదైన పోక్సో కేసు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఈ వ్యవహారంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ఈ నెల 8వ తేదీన ఫిర్యాదు అందినా ఇప్పటి వరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని డీజీపీ సీవీ ఆనంద్ ను ప్రశ్నించారు. కేసులో వెంటనే విచారణ చేపట్టాలని ఆదేశించారు. ఈ కేసును సమగ్రంగా దర్యాప్తు చేసేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి డీజీపీకి సూచించారు.

మిగతా 2లో..



# అంతర్రాష్ట్ర గంజాయి ముఠాపై పోలీసుల భారీ దాడి

- **400 కిలోల గంజాయి స్వాధీనం**
- **రూ.2 కోట్ల విలువైన మత్తు పదార్థాలు పట్టివేత**
- **ఏడుగురు అరెస్ట్, ఇద్దరి కోసం గాలింపు**

**హైదరాబాద్, మే 11 (తెలంగాణ ముచ్చట్లు):** మత్తు పదార్థాల అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు భారీ డ్రగ్ బస్ట్ నిర్వహించారు. ఎస్‌వోటీ కూకట్‌పల్లి, పటాన్‌చెరు పోలీసులు సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో

మిగతా 2లో..



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# కార్మికుల సంక్షేమమే ప్రజాపాలన ధ్యేయం

(మొదటి పేజీ తరువాయి)

కార్మికులకు గౌరవప్రదమైన జీవనం కల్పించడమే ఇందిరమ్మ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న లక్షలాది మంది కార్మికులకు ఈ వేతన సవరణల ద్వారా ప్రయోజనం చేకూరే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నిర్మాణ రంగం, పరిశ్రమలు, రవాణా, హోటల్ రంగం, వ్యవసాయ అనుబంధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల పరిస్థితులను కూడా ప్రభుత్వం ప్రత్యేకంగా పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. కార్మికుల సంక్షేమం కేవలం వేతనాల పెంపుతో మాత్రమే పరిమితం కాకుండా, సామాజిక భద్రత, ఆరోగ్య రక్షణ, ఉపాధి స్థిరత్వం, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలను కూడా ప్రభుత్వం ప్రాధాన్యంగా తీసుకుంటోందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కార్మికుల కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం కావాలంటే గౌరవప్రదమైన వేతన వ్యవస్థ అత్యంత కీలకమని అన్నారు. త్వరలోనే కార్మిక సంఘాలు, యాజమాన్యాలు, నిపుణులు, సంబంధిత వర్గాల అభిప్రాయాలను సమగ్రంగా సేకరించి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. రాష్ట్రాన్ని కార్మికులకు అనుకూలమైన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం దృఢ సంకల్పంతో ముందుకు సాగుతోందని తెలిపారు.

# ఖరీఫ్ 2026కు తెలంగాణ సన్నద్ధం

(మొదటి పేజీ తరువాయి)

మాత్రమే అందినట్లు తెలిపారు. జూన్ మొదటి వారంలో వరి నాట్లు ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున మే చివరినాటికి కనీసం 3.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్ ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయ్యే యూరియాలో కనీసం 90 శాతం తెలంగాణ రైతుల అవసరాలకు కేటాయించాలని మంత్రి డిమాండ్ చేశారు. రాష్ట్ర వనరులతో తయారవుతున్న యూరియా అవసరమైన సమయంలో రైతులకు అందకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ అంశంపై కర్మాగార యాజమాన్యానికి అధికారిక లేఖ రాయాలని అధికారులను ఆదేశించారు. ఎరువుల కంపెనీలకు మంత్రి హెచ్చరికలు జారీ చేశారు. గత నెల కేటాయించిన కోటాను పూర్తిగా సరఫరా చేయని కంపెనీలు పెండింగ్ నిల్వలతో పాటు ప్రస్తుత నెల కోటాను కూడా వెంటనే సరఫరా చేయాలని స్పష్టం చేశారు. రేక్ పాయింట్ల నుంచి జిల్లాలకు యూరియా రవాణాలో ఎలాంటి జాప్యం ఉండకూడదని తెలిపారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నానో యూరియా వినియోగంపై రైతుల్లో విస్తృత అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. నానో యూరియా వాడుతున్న రైతుల అనుభవాలను "రైతు నేస్తం" కార్యక్రమం ద్వారా ప్రసారం చేయాలని చెప్పారు. సాధారణ యూరియాను అధికంగా వాడటం వల్ల భూమి సారవంతత దెబ్బతింటుందని, భవిష్యత్తులో దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందని రైతులకు సూచించారు. నేల పరీక్షలు నిర్వహించి అవసరమైన ఎరువులనే వినియోగించాలని మంత్రి సూచించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేంద్ర మోహన్, వ్యవసాయ శాఖ డిజిటల్ విభాగం డైరెక్టర్ సరిత లక్ష్మి, వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి, ఎరువుల కంపెనీల ప్రతినిధులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రతి గింజను కొనుగోలు చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకారమే వరి, మొక్కజొన్న కొనుగోలు చేస్తుందని జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. "ప్రతి గింజను సేకరించేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది" అని పేర్కొన్నారు. రైతుల శ్రమ వృథా కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో అధికారులు కొనుగోలు కేంద్రాల ప్రస్తుత పరిస్థితి, నిల్వ సామర్థ్యం, రవాణా ఏర్పాట్లపై వివరాలు వెల్లడించారు. మిల్లర్లు కూడా ధాన్యం త్వరితగతిన అన్‌లోడింగ్ అయ్యేలా సహకరించాలని మంత్రి సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని అధికారులు తెలిపారు. అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్లు, గన్ని సంచులు అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొన్నారు.

# అంతర్రాష్ట్ర గంజాయి ముఠాపై పోలీసుల భారీ దాడి

(మొదటి పేజీ తరువాయి)

అంతర్రాష్ట్ర గంజాయి ముఠాను పట్టుకున్నారు.
ఒడిశా నుంచి మహారాష్ట్రకు ఔటర్ రింగ్ రోడ్ మార్గంగా గంజాయి తరలిస్తున్న ముఠాను పోలీసులు అడ్డుకున్నారు. ఈ దాడిలో 400 కిలోల డ్రై గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాల విలువ సుమారు రూ.2 కోట్లుగా పోలీసులు అంచనా వేశారు. దాడిలో ఒక డీసీఎం వాహనం, ఒక ఎర్టిగా కారు, ఆరు మొబైల్ ఫోన్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముఠాలో పాల్గొన్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ప్రధాన నిందితులుగా భావిస్తున్న ఏ1, ఏ2 కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయి.
ప్రాథమిక విచారణలో ఈ ముఠా ఒడిశా నుంచి పెద్ద మొత్తంలో గంజాయిని సేకరించి వివిధ రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఔటర్ రింగ్ రోడ్ మార్గాన్ని వినియోగిస్తూ రహస్యంగా రవాణా నిర్వహిస్తున్నట్లు తేలింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మత్తు పదార్థాల అక్రమ రవాణాపై మరింత కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

# బండి భగీరథ్ పోక్సో కేసుపై సీఎం రేవంత్ ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

ఘటనకు సంబంధించిన అన్ని అంశాలను లోతుగా పరిశీలించి పూర్తి నివేదిక అందించాలని ఆదేశించినట్లు సమాచారం. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటన ఏర్పాట్లలో సిబ్బంది బిజీగా ఉండటంతో ఆలస్యం జరిగిందని డీజీపీ ముఖ్యమంత్రికి వివరించినట్లు తెలిసింది. కేసుకు సంబంధించిన వివరాలను కూడా సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఇదిలావుండగా ఈ కేసుపై తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కూడా స్పందించింది. కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి నగర పోలీస్ కమిషనర్ నుంచి పూర్తి వివరాలు తెప్పించుకున్నారు. ఘటనపై విచారణ జరిపేందుకు ప్రత్యేక బెంచ్‌ను ఏర్పాటు చేసినట్లు సమాచారం. బాలిక హక్కుల పరిరక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని కమిషన్ తెలిపినట్లు తెలుస్తోంది. పోలీసుల వివరాల ప్రకారం, తన 17 ఏళ్ల కుమార్తెను బండి భగీరథ్ వేధిస్తున్నాడంటూ బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు శుక్రవారం రాత్రి కేసు నమోదు చేశారు. పోక్సో చట్టంలోని సెక్షన్ 11 రెడ్‌విత్ 12తో పాటు బీఎన్ఎస్ 74, 75 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మరోవైపు బాలికతో పాటు ఆమె తల్లిదండ్రులు డబ్బుల కోసం తనను బెదిరిస్తున్నారంటూ బండి భగీరథ్ కూడా కరీంనగర్ రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో ఈ కేసు మరింత సంచలనంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ వ్యవహారం రాజకీయంగా చర్చనీయాంశమవుతోంది. వివిధ రాజకీయ పార్టీలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటుండగా, కేసు దర్యాప్తుపై ప్రజల్లో ఆసక్తి నెలకొంది. ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు తర్వాత విచారణ మరింత వేగం పుంజుకునే అవకాశం ఉందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

# వైద్యుల బదిలీలు పారదర్శకంగా నిర్వహిస్తాం

- జీవో 38 ప్రకారమే ట్రాన్స్‌ఫర్ ప్రక్రియ
- గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్‌తో మంత్రి సమావేశం
- వైద్య విద్య, సేవల బలోపేతంపై దామోదర్ దృష్టి



**హైదరాబాద్, మే 11 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రభుత్వం జారీ చేసిన జీవో 38 ప్రకారం వైద్యుల బదిలీలను పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు.
మంత్రి చాంబర్‌లో జరిగిన సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, జాయింట్ సెక్రటరీ అయేషా, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత సత్యనారాయణ, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ గౌరవ్ ఉప్పల్, డీఎంఈ నరేంద్ర కుమార్, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నరహరి, ప్రధాన కార్యదర్శి లాలూ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యులు గతంలో జరిగిన జనరల్ ట్రాన్స్‌ఫర్ల మాదిరిగానే ఈసారి కూడా బదిలీలను పారదర్శకంగా, ఆఫ్లైన్ విధానంలో నిర్వహించాలని కోరారు. టీజీడీఏ కార్యవర్గ సభ్యులకు బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వాలని, రెండేళ్ల సర్వీస్ పూర్తి చేసిన వారికి కూడా బదిలీల్లో అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాల్లో పనిచేస్తున్న వైద్యులకు హైదరాబాద్ మెడికల్ కాలేజీల్లోకి బదిలీ అవకాశాలు ఇవ్వాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ, ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారమే బదిలీలు చేపడతామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో వైద్య విద్యను బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఇందుకు వైద్యుల పూర్తి సహకారం అవసరమని పేర్కొన్నారు.
మెడికల్ కాలేజీలు, ప్రభుత్వ ఆసుపత్రుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని బదిలీల ప్రక్రియ కొనసాగుతుందని మంత్రి తెలిపారు. అడ్మినిస్ట్రేషన్, బోధన, క్లినికల్ సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లాల్లోని ఆసుపత్రులు, మెడికల్ కాలేజీల్లో ఎక్కువకాలంగా పనిచేస్తున్న వారికి బదిలీల్లో ప్రాధాన్యం కల్పిస్తామని వెల్లడించారు. ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా సంస్కరణలు అమలు చేస్తున్నామని అధికారులు తెలిపారు. వైద్యులకు అనుకూల వాతావరణం కల్పిస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

# డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ

- జూన్ 12న పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు
- విద్యార్థులకు ఉచిత స్కూల్ కిట్ల పంపిణీ
- గవర్నర్‌ను ఆహ్వానించిన సీఎం రేవంత్

**హైదరాబాద్, మే 11 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో వచ్చే జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభమయ్యే సందర్భంగా విద్యార్థులతో పొగాకు, మద్యం, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రత్యేక ప్రతిజ్ఞ చేయించనున్నట్లు ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో లోక్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ విద్యా సంవత్సరం నుంచి పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థులకు వివిధ వస్తువులతో కూడిన స్కూల్ కిట్లను పంపిణీ చేయనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగ్, క్రీడా దుస్తులు, ఇతర అవసరమైన సామగ్రితో ఈ కిట్లు సిద్ధం చేస్తున్నట్లు గవర్నర్‌కు వివరించారు. విద్యార్థులతో నిర్వహించే ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని, స్కూల్ కిట్ల పంపిణీని లాంఛనంగా ప్రారంభించేందుకు గవర్నర్‌ను ముఖ్యమంత్రి ఆహ్వానించారు. విద్యార్థుల్లో మాదకద్రవ్యాలపై అవగాహన పెంపొందించడం, వ్యసనాలకు దూరంగా ఉంచడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. పాఠశాల విద్యాశాఖ, పోలీసు శాఖ, ఈగల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యాసంస్థల్లో డ్రగ్స్, ఇతర వ్యసనాల ప్రభావం లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యాసంస్థల యాజమాన్యాలు సమిష్టిగా బాధ్యత తీసుకుని విద్యాసంస్థలను



డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోందని ముఖ్యమంత్రి వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆరోగ్యకర జీవన విధానంపై అవగాహన పెంపొందించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు.

# నిరుపేద పిల్లలకు నాణ్యమైన విద్యే ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థుల కోసం ఖర్చు చేస్తున్న ప్రతి రూపాయి భవిష్యత్తరాలపై పెట్టుబడిగా భావిస్తున్నామని సీఎం పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే భావితరాలు తయారుకావాలని, అందుకు ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. రాష్ట్రంలోని 19 లక్షల మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లో ఉందని చెప్పారు.
విద్యా రంగంలో తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టాలన్నదే తన ఆకాంక్ష అని సీఎం వెల్లడించారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 8.22 శాతం నిధులు కేటాయించామని, రాబోయే సంవత్సరాల్లో దాన్ని 15 శాతం వరకు పెంచే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. 10వ తరగతి తర్వాత ఇంటర్మీడియట్ స్థాయిలో డ్రాపౌట్స్ అధికంగా ఉన్నాయని గుర్తించి నర్సరీ నుంచి 12వ తరగతి వరకు కొనసాగే విద్యా విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు. తొలి దశలో హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాలో ఈ విధానాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఉద్యోగాల కోసం నగరానికి వచ్చే నిరుపేద కుటుంబాల పిల్లలకు మెరుగైన విద్య అందించేందుకు రూ.1700 కోట్ల అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేశామని వెల్లడించారు.
విద్యా రంగంలో అంతర్జాతీయ ప్రమాణాలను తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని సీఎం చెప్పారు. జపాన్, సింగపూర్, వియత్నాం వంటి దేశాల్లోని విద్యా విధానాలను అధ్యయనం చేయడానికి ప్రతీ ఏడాది 500 మంది ప్రతిభావంతులైన ఉపాధ్యాయులను విదేశాలకు పంపే కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసే ఉపాధ్యాయులను ప్రభుత్వం ప్రత్యేకంగా సత్కరిస్తుందని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు అందించనున్న యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, ఇతర సామగ్రి కోసం ప్రభుత్వం వెయ్యి కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, లోపాలు ఉంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
ప్రైవేట్ విద్యాసంస్థలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు అత్యుత్తమ విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. తెలంగాణ పునర్నిర్మాణంలో ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్ వెంకటస్వామి, మహ్మద్ అజహరుద్దీన్, ప్రభుత్వ సలహాదారు కే కేశవరావుతో పాటు ప్రజాప్రతినిధులు, వైస్ చాన్సలర్లు, అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఒక్కొక్కరికి లక్ష రూపాయల ప్రోత్సాహక చెక్కులను అందజేశారు.

# వన్యప్రాణి సంరక్షణపై ప్రత్యేక వర్క్‌షాప్

(మొదటి పేజీ తరువాయి)

అడవుల పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు.
ఈ వర్క్‌షాప్‌లో అటవీ శాఖ ఉన్నతాధికారులు, వన్యప్రాణి నిపుణులు, విద్యార్థులు, ప్రకృతి ప్రేమికులు పాల్గొన్నారు. పెద్ద పిల్లి జాతుల సంరక్షణకు ఆధునిక సాంకేతికత వినియోగం, పర్యావరణ పరిరక్షణ చర్యలపై అధికారులు ప్రజెంటేషన్లు ఇచ్చారు. వన్యప్రాణుల సంరక్షణ కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా సమాజం మొత్తం భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉందని కార్యక్రమంలో పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు.

# ఈ నెల 13న జీళ్ళచెర్వు.. 14న ఏదులాపురం, రామన్నపేట క్లస్టర్ పరిధిలో ప్రజాదర్బార్

**వివరాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి**



ఖమ్మం బ్యూరో, మే 11(తెలంగాణ ముచ్చట్లు ): సామాన్యుల సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలనే సంకల్పంతో తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి చేపట్టిన 'ప్రజా దర్బార్' కార్యక్రమం పాలేరు నియోజకవర్గంలో విజయవంతంగా జరుగుతోంది. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా, అధికారులే నేరుగా ప్రజల వద్దకు వచ్చి వినతులు స్వీకరిస్తుండటంతో జనం నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఈ నెల 13న బుధవారం, 14న గురువారం మూడు ప్రధాన క్లస్టర్ల పరిధిలో నిర్వహించనున్న ప్రజా దర్బార్ల వివరాలను మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి వెల్లడించారు.

బుధవారం జీళ్ళచెర్వులో..
ఈ నెల 13న బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు కూసుమంచి మండలం జీళ్ళచెర్వు క్లస్టర్ పరిధిలో ప్రజా దర్బార్ నిర్వహించనున్నారు. గ్రామంలోని స్టార్ గార్డెన్స్ ఎదురుగా ఉన్న మైదానంలో జరిగే ఈ దర్బార్‌కు జీళ్ళచెర్వుతో పాటు పోచారం, తురకగూడెం, నేలపట్ల, అగ్రహారం, కోక్యా తండా, లోక్యా తండా, ముత్యాలగూడెం, చేగొమ్మ, ధర్మతండా, మునిగేపల్లి, కేశవాపురం, కిష్టాపురం గ్రామాలకు చెందిన ప్రజలు హాజరుకావచ్చు.

గురువారం ఉదయం ఏదులాపురంలో... మధ్యాహ్నం రామన్నపేటలో..
గురువారం ఉదయం 8 గంటలకు ఏదులాపురం మున్సిపాలిటీ క్లస్టర్ 1 పరిధిలోని 15 వార్డుల (1,2,3,4,5, 18,19,20,21,22,23,24,30,31, 32) ప్రజల కోసం 22వ వార్డు సత్యనారాయణపురంలోని టీసీవీ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో కార్యక్రమం ఉంటుంది.
అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు రామన్నపేట క్లస్టర్ పరిధిలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో దర్బార్ నిర్వహిస్తారు. 1వ డివిజన్ కైకొండాయిగూడెం, 59వ డివిజన్ దానవాయిగూడెం, 60వ డివిజన్ రామన్నపేట ప్రజలు ఇక్కడ తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చు.

వేదికలపైనే పరిష్కారం!
ప్రధానంగా భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కార దిశగా తక్షణ చర్యలు చేపట్టాలని ఇప్పటికే మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులు ఈ వేదికలపై అందుబాటులో ఉంటారు. ప్రజల ప్రతి విన్నపాన్ని నేరుగా పర్యవేక్షిస్తామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దయాకర్ రెడ్డి కోరారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలి...

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**ఖమ్మం బ్యూరో, మే 11(తెలంగాణ ముచ్చట్లు ):**ప్రజలు సమస్యలు తెలుపుతూ సమర్పించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు.

కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.

తల్లాడ మండలం కలకొడిమ గ్రామానికి చెందిన మనుబోలు రామారావు తన ఇంటికి వెళ్లే పంచాయతీ రోడ్డుకి ముళ్ళ కంప వేసి ప్రజా రహదారిని అడ్డగించడం గురించి ఫిర్యాదు చేస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని దరఖాస్తు చేసుకోగా, జిల్లా పంచాయతీ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

మధిర మండలం వెంకటాపురం, వంగవీడు, సిరిపురం గ్రామాలకు చెందిన పలు రైతులు పాలవాగు తర్వాత వచ్చు భగవానుల పురం గ్రామం వెళ్ళు స్టేజి నుండి ఆర్ అండ్ బి రోడ్డు ఎడం ప్రక్కన వరద వెళ్ళుటకు వేసిన పైపులు గత ఏడాది డ్యామేజ్ అయ్యాయని, ఒకవైపు మాత్రమే మళ్లీ పైపులు వేసారని రెండోవైపు పూడ్చివేసారని దానివల్ల వర్షం పడినప్పుడు నీరు వాగు వైపుకు రావటం లేదని, పాత పైపులు తీయకపోతే తమకు చాలా నష్టం జరుగుతుందని న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, సత్తుపల్లి ఈఈ ఆర్ అండ్ బి కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

ఖమ్మం పట్టణానికి చెందిన పగిళ్ళ రాము తనకు దివ్యాంగుల కోటాలో మీసేవ సెంటర్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఈడిఎంకు రాస్తూ అవకాశం మేరకు పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు.

వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఖమ్మం జిల్లా అధ్యక్షులు డి. నాగరాజు ఖమ్మం నగరానికి చెందినటువంటి నిరుపేద దివ్యాంగుల కుటుంబానికి చెందిన పదిమంది దివ్యాంగులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పిడి హౌసింగ్ కు రాస్తూ రెండవ జాబితాలో పరిశీలించి అర్హత మేరకు మంజూరు చేయాలని కలెక్టర్ సూచించారు.

ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.




# 27ఏళ్ల తరువాత పాఠశాల చెంతకు..

**ఘనంగా ఆత్మీయ కలయిక**

**ఖమ్మం బ్యూరో,మే 11(తెలంగాణ ముచ్చట్లు ):** మనకు తెలిసిన వ్యక్తే కొద్ది రోజుల తర్వాత కనిపిస్తేనే ఎంతో ఆనందంగా పలకరించి మాట్లాడుతాం.. అదే 10 సంవత్సరాలు కలిసి చదువుకొని ఆ తర్వాత ఉన్నత చదువుల కోసం ఎవరి గమ్యంలో వారు వెళ్లి మళ్లీ 27 ఏళ్ల తర్వాత ఒక్క చోట కలిసిన వారి ఫీలింగ్స్ ఎలా ఉంటాయో చెప్పనక్కర్లేదు. ఆత్మీయ సమ్మేళనంతో అందరూ ఒక్క చోట కలిస్తే ఇక ఆ ఆనందానికి అవధులుండవు.. ఆ మధురమైన క్షణాలు, మళ్లీ అవన్నీ గుర్తు చేసుకుంటూ 27 ఏళ్ల తర్వాత కూసుమంచి మండలం చెగోమ్మ గ్రామంలోని జడ్.పి.హెచ్.ఎస్ హైస్కూల్లో కలుసుకుని ఆనందంగా గడిపారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం చెగోమ్మ గ్రామం లో జడ్పీ హైస్కూల్ 19981999 విద్యార్థులు. జీవితంలో స్నేహితుల పాత్ర ఎంతో కీలకం. ఆట పాటలు, చిల్లర పనులు కష్టం సుఖం ఇలా ఏదైనా కాని అన్నింట్లో మన వెన్నంటే ఉండీ సపోర్ట్ చేసేది ఒక స్నేహితులు మాత్రమే. అందరి కన్నా మన జీవితంలో చెరగని ముద్ర వేసేది పదవ తరగతి వరకు చదువుకున్న దోస్తులు.. వారితో ఉన్న జ్ఞాపకాలు ఎన్నటికి మరచిపోనివి మరుపు రానివి.. పదో తరగతి తర్వాత దూరమైన అలాంటి స్నేహితులను మళ్లీ 27 ఏళ్ల తర్వాత అందరు ఆత్మీయ సమ్మేళనం పేరుతో కలుసుకుంటే ఎంత ఆనందంగా ఉంటుందో.. అలానే ప్రతి ఒక్కరి జీవితంలో గుర్తుండే తీపి జ్ఞాపకాలు చిన్నతనంలోనే ఉంటాయి. తను చదువుకునే రోజులు.. చేసే అల్లరి.. స్నేహితుల కోసం చేసే ఫైటింగ్లు.. వారితో కలిసి ఆడిన ఆటలు.. చిన్న చిన్న గ్యాంగ్లు.. అవన్నీ ఓ మధురమైన క్షణాలు, మళ్లీ అవన్నీ గుర్తు చేసుకుంటూ 27 ఏళ్ల తర్వాత కలుసుకు న్నారు. వారికి చదువును బోధించిన ఉపాధ్యాయులను సన్మానం చేయడంతో పాటు వారు స్కూల్లో చదివినప్పుడు జరిగిన చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఎంతో ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు మురళి, ఖాన్,శంకర్ రెడ్డి,రంగా చార్యులు,శ్రీను, జానకి రాములు, శివరాణి, ఆర్గనైజర్లు రామారావు,అశోక్,నరసింహారావు,రమేష్,సంగీత,సునీత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు ప్రాణభయంతో వణుకుతుంటే.. అధికారులు మాత్రం మౌనంగా..!

- రామన్నపల్లిలో వీధి కుక్కలు కోతుల స్వైర విహారం.





**జమ్మికుంట టౌన్ మే 11 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణంలోని రామన్నపల్లి ప్రాంతంలో వీధి కుక్కలు, కోతుల బెడద రోజురోజుకు భయానకంగా మారుతోంది. గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు ఎప్పుడు ఎవరిపై దాడి చేస్తాయోనన్న భయంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా వీధుల్లో స్వైర విహారం చేస్తున్న కుక్కల కారణంగా చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు బయటకు రావాలంటేనే వణికిపోతున్నారు. ఇటీవల మేడిపల్లి రవీందర్‌కు చెందిన ఆవుపై వీధి కుక్కలు దాడి చేయడంతో అది రేబిస్ బారినపడి మృతి చెందింది. ఈ ఘటనతో కుటుంబానికి సుమారు రూ.20 వేల వరకు నష్టం వాటిల్లినట్లు తెలిసింది. ఈ సంఘటన తర్వాత స్థానిక ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. “ఇవాళ ఆవు.. రేపు మనుషుల ప్రాణాలే ప్రమాదంలో పడతాయేమో” అంటూ ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు ప్రాణభయంతో కాలం గడుపుతున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. సమస్య తీవ్రరూపం దాల్చినా కుక్కల నియంత్రణకు ఇప్పటివరకు ఎలాంటి ప్రత్యేక చర్యలు చేపట్టకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శిస్తున్నారు. ప్రజల భద్రతను కాపాడాల్సిన బాధ్యత ఉన్న అధికారులు కార్యాలయాలకే పరిమితమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు చెల్లించే పన్నులతో జీతాలు తీసుకుంటూ ప్రజా సమస్యలను గాలికొదిలేయడం సరికాదని, పనితీరు లేని అధికారుల కంటే నిజాయితీగా పనిచేసే వారికి అవకాశం ఇస్తేనే ప్రజలకు న్యాయం జరుగుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రామన్నపల్లి ప్రాంతంలో వీధి కుక్కలు, కోతుల నియంత్రణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# జమ్మికుంట రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని మహిళ మృతి..

**అనాథగా మారిన నాలుగేళ్ల బాలుడు**





**జమ్మికుంట టౌన్ మే 11 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట రైల్వే స్టేషన్ ఆవరణలో అపస్మారక స్థితిలో కనిపించిన ఓ గుర్తుతెలియని మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమెతో పాటు ఉన్న సుమారు నాలుగేళ్ల బాలుడు తల్లి మృతితో అనాథగా మారడం హృదయ విదారకంగా మారింది.

ప్రభుత్వ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 9న స్టేషన్ టికెట్ బుకింగ్ కేంద్రం ప్రవేశ ద్వారం వద్ద సదరు మహిళ స్పృహ తప్పి పడిఉండటాన్ని రైల్వే సిబ్బంది గమనించారు. వెంటనే ఆమెను 108 అంబులెన్స్ ద్వారా జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఈ నెల 10న రాత్రి ఆమె మృతి చెందింది.

మృతురాలు నీలం రంగు హాఫ్ ప్యాంట్, పింక్, బ్లూ, ఎల్లో రంగుల డిజైన్ కలిగిన టాప్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఆమెతో పాటు ఉన్న బాలుడిని రైల్వే పోలీసులు సురక్షితంగా బాలల సంరక్షణ కేంద్రానికి తరలించారు. బాలుడికి మాటలు సరిగా రాకపోవడం, మహిళ వద్ద ఎలాంటి గుర్తింపు పత్రాలు లేకపోవడంతో ఆమె వివరాలు తెలియరాలేదు.

మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. స్టేషన్ పరిసరాల్లోని సీసీటీవీ దృశ్యాలను పరిశీలిస్తూ, ఆమె ఏ రైలులో వచ్చింది? ఎవరైనా వెంట ఉన్నారా? అనే కోణంలో విచారణ చేపట్టారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు 9949304574, 8712658604 నంబర్లకు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఈ ఘటన స్థానిక ప్రయాణికులను కలిచివేసింది. పోస్టుమార్టం నివేదిక అనంతరం మృతికి గల పూర్తి కారణాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# హుజూరాబాద్‌కు ట్రామా కేర్ సెంటర్.. మంత్రి దామోదర గ్రీన్ సిగ్నల్



**హుజూరాబాద్, మే 11(తెలంగాణ ముచ్చట్లు ):** హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో త్వరలో ఆధునిక ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు కానుందని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో వివరాలు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదాలు, అత్యవసర పరిస్థితుల్లో గాయపడిన బాధితులకు తక్షణ వైద్య సేవలు అందించేందుకు ట్రామా కేర్ సెంటర్ ఎంతో ఉపయోగకరంగా మారుతుందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా వరంగల్-కరీంనగర్ ప్రధాన రహదారి మధ్యలో హుజూరాబాద్ ఉండటంతో ఈ కేంద్రం ఏర్పాటు వల్ల వేలాది మందికి ప్రాణాపాయం నుంచి ఉపశమనం కలిగే అవకాశం ఉందన్నారు.

ఈ అంశాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించి ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు అంగీకారం తెలిపినట్లు ప్రణవ్ వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హుజూరాబాద్ నియోజకవర్గంలో వైద్య రంగానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన సదుపాయాలు కల్పిస్తూ పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించే దిశగా కృషి కొనసాగుతోందని ఆయన తెలిపారు. ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు పూర్తయితే అత్యవసర వైద్య సేవలు మరింత వేగంగా అందుబాటులోకి వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# బండి భగీరథ్‌ను అరెస్ట్ చేయాలి.!



మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య.

**సత్తుపల్లి, మే 11(తెలంగాణ ముచ్చట్లు):** పోక్సో కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య డిమాండ్ చేశారు. మైనర్ బాలికపై జరిగిన ఘటన అత్యంత దారుణమని ఆయన పేర్కొన్నారు. పోక్సో కేసు నమోదు అయినప్పటికీ ఇప్పటివరకు అరెస్ట్ చేయకపోవడం వెనుక రాష్ట్ర ప్రభుత్వ హస్తం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. కేంద్ర మంత్రి కుమారుడికి ఒక న్యాయం, సామాన్య ప్రజలకు మరో న్యాయమా అని ప్రశ్నించారు. మధ్యతరగతి కుటుంబానికి చెందిన మైనర్ బాలికను మోసం చేసి, మద్యం తాగించి పలుమార్లు అత్యాచారం చేశారనే ఆరోపణలు ఉన్నప్పటికీ, తొలుత పోలీసులు కేసు నమోదు చేసేందుకు నిరాకరించారని ఆరోపించారు. బాధిత కుటుంబ సభ్యులు మోదీ సభలో ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించిన తర్వాతే పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు. బండి భగీరథ్‌ను కాపాడేందుకు ప్రయత్నించడం ద్వారా బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య ఉన్న “ఫెవికాల్ బంధం” బయటపడుతోందని సండ్ర వెంకట వీరయ్య విమర్శించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటే తక్షణమే బండి భగీరథ్‌ను అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి



**బిషప్ విజయ పాల్ రెడ్డి**

**కాజీపేట్ మే 11 (తెలంగాణ ముచ్చట్లు):** దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని రోమన్ క్యాథలిక్ సంఘం గత 40 ఏళ్లుగా రాజీలేని పోరాటం చేస్తున్నదని దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా వెంటనే కల్పించాలని వరంగల్ మేత్రాసనం బిషప్ విజయపాల్ రెడ్డి డిమాండ్ చేశారు.

దళిత క్రైస్తవుల రాజ్యాంగ హక్కుల సాధనకై కాజీపేట లోని ఫాతిమానగర్ లో ఫాదర్ నవీన్ అధ్యక్షతన సోమవారం రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వరంగల్ మేత్రాసనం బిషప్ విజయ్ పాల్ రెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా విజయపాల్ రెడ్డి మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని వారి ప్రాథమిక హక్కు ప్రతి ఏటా ఆగస్టు 10వ తేదీన నిరసన దినంగా మేము జరుపుకుంటున్నామన్నారు సుదీర్ఘ పోరాటంలో సమస్య పరిష్కారమాయే వరకు రోమన్ క్యాథలిక్ సంస్థానం దళిత క్రైస్తవులకు అండగా ఉంటుందని పేర్కొన్నారు అనంతరం మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య మాట్లాడుతూ ఈ ఉద్యమానికి తమ పార్టీ తరపున సంపూర్ణ మద్దతును ప్రకటించారు అనంతరం సమావేశంలో పాల్గొన్న వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండి అయూబ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని పార్టీ అధిష్టానంతో చర్చించి మద్దతు లభించేదా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సిపిఐ నాయకుడు రాజమౌళి సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి నున్న అప్పారావు మాట్లాడుతూ దేశంలో మతం మారినంత మాత్రాన కుల వివక్షత పోలేదని కులం ఉన్నంతకాలం ఎస్సీ హోదా కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. దళిత క్రైస్తవుల సమస్యలను మతపరమైన కోణంలో కాకుండా సామాజిక వివక్షత కోణంలో చూడాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రేవ అశోక్ పాల్, బోడ డిన్న , ఫాదర్ జోసఫ్ రాజ్ మోహన్, ప్రవీణ్, ఎస్ కిరణ్,, జన్ను ఇర్మియ, అరుణ్ జేమ్స్, కొడవటి రవి నాతోపాటు తదితర నాయకులు క్రైస్తవ సంఘాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక



# ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం చేయండి

- అర్హులైన ప్రతి ఓటరును గుర్తించాలని సూచన.

**భద్రాద్రి కొత్తగూడెం, మే 11(తెలంగాణ ముచ్చట్లు):** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. జిల్లా ఐడీఓసీ కార్యాలయం నుంచి కలెక్టర్ అంకిత్, ఐటీడీఏ పీవో రాహుల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైందన్నారు. ప్రతి అర్హుడైన ఓటరును సరైన విధంగా గుర్తించి మ్యాపింగ్ పూర్తి చేయడం ద్వారా పారదర్శకమైన ఓటరు జాబితా సిద్ధమవుతుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న మ్యాపింగ్ ప్రక్రియను రానున్న 15 రోజుల్లో 90 శాతం పూర్తి చేసేలా జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయిలో మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు. వీఐపీలు, ఉద్యోగుల వివరాల మ్యాపింగ్ పూర్తి కాని ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. బూత్ లెవెల్ ఆఫీసర్లు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, సందేహాల నివృత్తికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మ్యాపింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు స్వయం సహాయక సంఘాలు, ఆర్డబ్ల్యూఎస్ సిబ్బంది సహకారాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి బుధవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి, మ్యాపింగ్ ప్రక్రియపై తలెత్తుతున్న సందేహాలను నివృత్తి చేయాలని అధికారులకు సూచించారు.

# హుజురాబాద్ పురపాలక సంఘ కమిషనర్‌గా బి. కిషన్ బాధ్యతల స్వీకరణ

**హుజురాబాద్, మే 11(తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్ పురపాలక సంఘ కమిషనర్‌గా బి. కిషన్ బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందించి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు పారదర్శకంగా, వేగవంతమైన సేవలు అందించే దిశగా పనిచేస్తానని తెలిపారు. పట్టణ అభివృద్ధి, పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు, సిబ్బంది



ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

# దండేపల్లి గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న సర్పంచ్ సంపత్

**ఎల్కతుర్తి, మే 11 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండలం లోని దండేపల్లి గ్రామంలో గ్రామ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న సర్పంచ్ గొలిపెల్లి సంపత్ ప్రజల ప్రశంసలు అందుకుంటున్నారు. గ్రామంలో తాగునీటి సమస్యలు, పారిశుద్ధ్యం, రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు వంటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతూ ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటున్నారు.

మండల కేంద్రంలోని 7వ వార్డులో ఇటీవల తాగునీటి సమస్య తలెత్తడంతో స్థానికులు సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించారు. స్వయంగా ప్రాంతాన్ని పరిశీలించి భూగర్భ పైపులైన్ దెబ్బతినడంతో నీటి సరఫరా నిలిచిపోయిందని గుర్తించారు. వెంటనే కార్మికులతో తవ్వకాలు చేపట్టించి పైపులైన్ మరమ్మతు పనులు ప్రారంభించారు. పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తూ ప్రజలకు త్వరగా తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఈ సందర్భంగా సర్పంచ్ గొలిపెల్లి సంపత్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ఎండాకాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో



పనులు చేపడుతున్నామని చెప్పారు. ప్రజలు సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వెంటనే స్పందించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

సర్పంచ్ వెంటనే స్పందించి పనులు ప్రారంభించడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో చొరవ చూపుతూ గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న సర్పంచ్ గొలిపెల్లి సంపత్‌ను గ్రామస్తులు అభినందిస్తున్నారు.

# అశ్వారావుపేట సమగ్ర అభివృద్ధే లక్ష్యం

మంత్రి సీతక్కను కలిసిన ఎమ్మెల్యే జారె.



**అశ్వారావుపేట, మే 11 (తెలంగాణ ముచ్చట్లు):** అశ్వారావుపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సోమవారం హైదరాబాద్‌లో మంత్రి ధనసరి సీతక్క (అనసూయ)ను ఆమె చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా గ్రామీణ రహదారుల అభివృద్ధి, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం, పంచాయతీలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, మహిళా-శిశు సంక్షేమ కార్యక్రమాల సమర్థవంతమైన అమలు, గ్రామీణాభివృద్ధి పనులకు ప్రత్యేక నిధుల కేటాయింపుపై ఎమ్మెల్యే ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. ప్రజల అవసరాలు, గ్రామాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై ప్రభుత్వం మరింత దృష్టి సారించాలని కోరగా, మంత్రి సీతక్క సమస్యలను సానుకూలంగా పరిశీలించి అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ, "ప్రజల ఆశయాల సాధనతో పాటు అశ్వారావుపేట సమగ్ర అభివృద్ధే నా లక్ష్యం. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందే వరకు ప్రజల కోసం నిరంతరం కృషి కొనసాగిస్తాను" అని పేర్కొన్నారు.


# మద్దిగట్ల—మోజర్ల పాఠశాలలో ఘనంగా విద్యా వారోత్సవాలు




**పెద్దమందడి,మే11(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మద్దిగట్ల-మోజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ విద్యా వారోత్సవాలను ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ఎస్. వరప్రసాద్ రావు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు 21 రకాల వస్తువులతో కూడిన కిట్, అల్పాహారం, ఉచిత దుస్తులు, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు ప్రభుత్వం అందిస్తున్నదన్నారు.తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.విద్య వారోత్సవాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని, సృజనాత్మకతను పెంపొందించడంతో పాటు వారి ప్రతిభను వెలికితీయడమే లక్ష్యమని తెలిపారు. వారోత్సవాల ముగింపు సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రత్యేక పురస్కారాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి. వెంకటస్వామి, మధుసూదన్, ఎన్. వెంకటస్వామి, చిన్నారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

# పీచరలో బడి బాట కార్యక్రమం నిర్వహణ

**వేలేరు, మే 11 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా వేలేరు మండలం పీచర జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాలలో బడి బాట కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పీచర గ్రామ సర్పంచ్ మరిజే అనిత-నరసింహారావు, ఉప సర్పంచ్ గుడికందుల ప్రశాంత్, పాఠశాల హెడ్‌మాస్టర్ శ్రీదేవి, ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు గుడికందుల రాకేష్, పాఠశాల చైర్మన్ మండల ఉమా మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.




# మొక్కజొన్నలను వెంటనే తరలించేందుకు చర్యలు తీసుకోవాలి

- చింతకాని బిఆర్ఎస్ మండల నాయకులు డిమాండ్ చేశారు.
- జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందజేత

**ఖమ్మం బ్యూరో, మే 11(తెలంగాణ ముచ్చట్లు ):** చింతకాని మండలంలో గత 45 రోజులుగా కాటాలు వేసి కల్లాల వద్దనే ఉన్న మొక్కజొన్నలు లారీలు, గోదాముల కొరత కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల సొసైటీ అధికారులు రోజుకు కేవలం 200 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేస్తామని ప్రకటించడంతో రైతుల పరిస్థితి మరింత క్లిష్టంగా మారిందన్నారు.



ఈ సమస్యపై స్పందిస్తూ చింతకాని మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ని కలిసి వినతిపత్రం సమర్పించారు. మండలంలోని రైతుల పరిస్థితి దారుణంగా మారిందని, కాటాలు వేసి 45 రోజులు దాటినా మొక్కజొన్నలను గోదాములకు తరలించలేక రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని వివరించారు. లారీలు అందుబాటులో లేకపోవడంతో పాటు, లారీ కాంట్రాక్టర్లు కృత్రిమ కొరత సృష్టించి రైతుల నుంచి క్వింటాకు రూ.100 నుంచి రూ.120 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం, అధికార యంత్రాంగం వెంటనే జోక్యం చేసుకుని మండలంలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు హనుమంతరావు, బొడ్డు వెంకట రామారావు, గడ్డం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి సోమవారం గ్రీవెన్స్‌కు రండి

- ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదిక.
- కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ పిలుపు.

**కల్లూరు, మే 11(తెలంగాణ ముచ్చట్లు):** ప్రజా సమస్యలను స్థానికంగానే త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రతి సోమవారం కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఐఏఎస్ తెలిపారు. ఖమ్మం జిల్లా విస్తీర్ణం ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఖమ్మం వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఈ వేదికను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి డివిజన్ స్థాయి అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని చెప్పారు. ఉదయం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, మధ్యాహ్నం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. గత వారం అందిన వినతులపై తీసుకున్న చర్యలను కూడా సమీక్షిస్తామని పేర్కొన్నారు. సమస్యలతో బాధపడుతున్న ప్రతి ఒక్కరూ సోమవారం జరిగే గ్రీవెన్స్ కార్యక్రమానికి హాజరై తమ సమస్యలను తెలియజేయాలని సబ్ కలెక్టర్ కోరారు.





## వేలేరు లో హనుమాన్ మాలధారణ స్వాముల భిక్ష కార్యక్రమం

**వేలేరు, మే 11 (తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండల కేంద్రంలోని పోచమ్మ కాలనీలో పిండి సునీల్, వేలేరు మేజర్ గ్రామపంచాయతీ వార్డు సభ్యుల ఆధ్వర్యంలో హనుమాన్ మాలధారణ స్వాముల భిక్ష కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిల్లా యాదగిరి, వేలేరు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మరియు సర్పంచ్, వేలేరు మేజర్ గ్రామపంచాయతీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, వేలేరు మేజర్ గ్రామం హనుమాన్ నామస్మరణతో మారుమోగుతుందని తెలిపారు. స్వాముల సిద్ధి సంకల్పం సఫలం కావాలని, గ్రామ ప్రజలపై హనుమాన్ ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో సంపత్ రెడ్డి, అనిల్, హనుమాన్ మాలధారణ స్వాములు చంద్రమౌళి, నాగరాజు, మహేందర్, రాజు, లింగయ్య, కుమార్, సందీప్, సాంబరాజు, షరీఫ్, రమేష్, సంపత్, రాకేష్ తదితరులు మరియు పెద్ద సంఖ్యలో హనుమాన్ భక్తులు పాల్గొన్నారు.



## ఉన్నోడికి ఒక న్యాయం.. లేనోడికి మరో న్యాయమా..?

**– తక్కళ్లపల్లి రాజేశ్వర్ రావు**

**జమ్మికుంట టౌన్ మే 11 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంటలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ రాష్ట్ర సహకార సంఘాల మరియు జమ్మికుంట మున్సిపల్ మాజీ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్ రావు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌పై తీవ్ర విమర్శలు చేశారు.

పోక్సో కేసులో బండి సంజయ్ కుమారుడు భగీరత్‌పై కేసు నమోదు చేసినప్పటికీ ఇప్పటివరకు అరెస్ట్ చేయకుండా పోలీసులు కాలయాపన చేస్తున్నారని ప్రశ్నించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్, రాష్ట్ర హోంశాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కుమ్మక్కై కేసును బలహీనపరిచే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మైనర్ బాలికకు న్యాయం చేయకుండా బండి సంజయ్ కుమారుడిని కాపాడే ప్రయత్నం జరుగుతోందని, రాష్ట్రంలో పేదలకు ఒక న్యాయం.. పెద్దలకు మరో న్యాయమా అని ప్రశ్నించారు. పోక్సో కేసులో నిష్పక్షపాత విచారణ జరగాలంటే బండి సంజయ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ విషయాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, లేకపోతే బాధితుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, మున్సిపల్ కౌన్సిలర్ పొనగంటి రాము, బచ్చు మాధవి-శివశంకర్, మాజీ కౌన్సిలర్ గాజుల భాస్కర్, మాజీ మున్సిపల్ చైర్మన్ పొడేటి రామస్వామి, మద్ది సంపత్, వెంకటేశ్, జానీ, శ్రీధర్, రుస్తుం, వార్డు అధ్యక్షులు మల్లికార్జున్, సందీప్, సలీం తదితరులు పాల్గొన్నారు.




## నర్సుల సేవలు అమూల్యం : బ్రహ్మకుమారి శ్రీవాణి

**హుజురాబాద్, మే 11 (తెలంగాణ ముచ్చట్లు ):** ప్రజాపిత బ్రహ్మకుమారి సంస్థ ఆధ్వర్యంలో హుజురాబాద్ పట్టణంలోని బ్రహ్మకుమారి సెంటర్‌లో నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారి సెంటర్ ఇంచార్జ్ శ్రీవాణి మాట్లాడుతూ అంకితభావంతో సేవలు అందిస్తున్న నర్సుల సేవలు అమూల్యమన్నారు. కార్యక్రమంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేయడంతో పాటు నర్సులను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. బ్రహ్మకుమారి కల్పన మాట్లాడుతూ కరోనా సమయంలో నర్సులు చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో ఈశ్వరయ్య, రాజయ్య, జ్యోతిరాణి, మౌనిక, కవిత, శ్రీలేఖ, సాత్విక, త్రివేణి, జోయా, లావణ్య, కల్పన, కోమల తదితరులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- ఆశాల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం తగదు.
- సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.నవీన్ రెడ్డి, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పాకలపాటి రమణ



**ఖమ్మం బ్యూరో , మే 11 (తెలంగాణ ముచ్చట్లు ):** ఆశా వర్కర్ల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఖమ్మం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.నవీన్ రెడ్డి, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రమణ మాట్లాడుతూ ఆశా వర్కర్లు గ్రామీణ, పట్టణ ఆరోగ్య వ్యవస్థలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నప్పటికీ ప్రభుత్వం వారి సమస్యలను నిర్లక్ష్యం చేస్తోందన్నారు. మార్చి, ఏప్రిల్ నెలల పారితోషికాలను వెంటనే చెల్లించాలని, ప్రతి నెల 1వ తేదీన వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు రూ.18 వేల ఫిక్స్డ్ వేతనం నిర్ణయించాలని, కేంద్ర ప్రభుత్వం పెంచిన రూ.1500 పారితోషికాన్ని తక్షణమే అమలు చేయాలని కోరారు. 2021 జూలై నుండి డిసెంబర్ వరకు 6 నెలల పి.ఆర్.సి ఎరియర్స్, 2022 నుండి 2025 వరకు లెప్రసీ సర్వే, పల్స్ పోలియో, ఎలక్షన్ డ్యూటీల పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని అన్నారు. ఎగ్జామ్ డ్యూటీలకు అదనపు పారితోషికం నిర్ణయించాలని, 50 లక్షల ఇన్సూరెన్స్, 50 వేల మట్టి ఖర్చులపై జి.ఓలు వెంటనే జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు పి.ఎఫ్., ఇ.ఎస్.ఐ., ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎ.ఎన్.ఎం., జి.ఎన్.ఎం. ట్రైనింగ్ పూర్తి చేసిన వారికి ప్రమోషన్ అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రతి ఆదివారం, పండుగలకు సెలవులు ప్రకటించాలని, ప్రసూతి సెలవులపై ఉత్తర్వులు జారీ చేయాలని తెలిపారు. పారితోషికం లేని పనులు చేయించకుండా పనిభారం తగ్గించాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రత్యేక రెస్ట్ రూములు ఏర్పాటు చేయాలని, ఆశాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు విజయ, కమల, సుధారాణి, రమణ, రమ్య, సావిత్రి, రూపా తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ప్రతిభ వికాసానికి సమ్మర్ క్యాంపులు దోహదం : చైర్‌పర్సన్ సుహాసిని మనోజ్ రావు

**హుజురాబాద్, మే 11(తెలంగాణ ముచ్చట్లు ):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల సందర్భంగా హుజురాబాద్‌లోని PM SHRI గవర్నమెంట్ హై స్కూల్ పాఠశాలలో సమ్మర్ క్యాంప్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని మనోజ్ రావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.





విద్యార్థులలో సృజనాత్మకత, క్రమశిక్షణ, ఆరోగ్య చైతన్యం పెంపొందించేందుకు సమ్మర్ క్యాంపులు ఎంతో ఉపయోగపడతాయని ఆమె తెలిపారు. సమ్మర్ క్యాంప్‌లో భాగంగా నిర్వహిస్తున్న స్పెషల్ ఆక్టివిటీస్, గేమ్స్ అండ్ స్పోర్ట్స్, డ్రాయింగ్, మ్యూజిక్ అండ్ డాన్స్, యోగ తదితర కార్యక్రమాల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్, హెచ్ఎం శోభారాణి, హెచ్ఎం తిరుమల, రాంపూర్ హెచ్ఎం ప్రదీప్, ఉర్దూ మీడియం హెచ్ఎం బేగం, రిటైర్డ్ హెచ్ఎం రత్నం, వార్డ్ కౌన్సిలర్ కోయల్‌కార్ భారతి, ఏఐపీసీ చైర్మన్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళా సమాజాన్ని కించపరిచే వారికి పదవుల్లో స్థానం లేదు

**మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్**



**జమ్మికుంట టౌన్ మే 11 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడిపై నమోదైన పోక్సో కేసు నేపథ్యంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల భద్రత, న్యాయం గురించి మాట్లాడే బండి సంజయ్ తన కుమారుడిని కాపాడే ప్రయత్నం చేస్తూ మైనర్ బాలికకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి ఘటనలో నైతిక బాధ్యత వహిస్తూ బండి సంజయ్ వెంటనే తన పదవికి వైదొలగాలని, కేసులో నిందితుడికి చట్టపరంగా పడే శిక్ష అమలుకు సహకరించాలని డిమాండ్ చేశారు. మహిళా సమాజాన్ని కించపరిచే విధంగా వ్యవహరించడం తగదని మండిపడ్డారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షుడు ముంతాజ్ అలీ జావేద్, వార్డు సభ్యులు కోలుగురి సురేష్, పొనగంటి రాము, చింతల శ్రీనివాస్, సహకార సంఘం అధ్యక్షుడు పొనగంటి సంపత్, మంద రాజేష్, పోల్సాని వేణుగోపాల్ రావు, భిక్షపతి, శివశంకర్, శివ నాయకులు శ్రీనివాస్, రాము, పాల్గొన్నారు.

## ప్రతి చిన్నారి బడిబాట పట్టాలి.. విద్యతోనే బంగారు భవిష్యత్

**మున్సిపల్ చైర్మన్**

**జమ్మికుంట టౌన్ మే 11 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న విద్య వారోత్సవాల కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్య ప్రాధాన్యంపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.




ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ప్రతి ఇంట్లో బడి ఈడు పిల్లలు తప్పనిసరిగా పాఠశాలకు వెళ్లాలి.. విద్యే పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది" అని పేర్కొన్నారు. పేదరికం, పరిస్థితులు ఏవైనా సరే పిల్లలను చదివించడం ప్రతి తల్లిదండ్రి బాధ్యత అని అన్నారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లల్లో ఉన్న ప్రతిభను వెలికితీసేది విద్యేనని, చదువుతోనే ఉన్నత స్థాయికి చేరుకుని సమాజంలో గౌరవప్రదమైన స్థానం సంపాదించవచ్చని చెప్పారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి తమ తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక వార్డు సభ్యుడు మాచెర్ల రాజు, మండల విద్యాశాఖ అధికారి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# పశ్చిమ బెంగాల్ సీఎంవోలో కలకలం




పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి కార్యాలయానికి చెందిన కీలక వ్యక్తి చంద్రనాథ్ రథ్ హత్య కేసు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. ముఖ్యమంత్రి సువేందు అధికారి వ్యక్తిగత సహాయకుడిగా పనిచేస్తున్న చంద్రనాథ్ రథ్‌ను దారుణంగా హత్య చేసిన కేసులో అరెస్టయిన ముగ్గురు నిందితులను పోలీసులు బారాసాత్ కోర్టులో హాజరుపర్చారు. విచారణలో కీలక సమాచారం రాబట్టాల్సి ఉందని పోలీసులు కోర్టుకు వివరించగా, కోర్టు వారికి 13 రోజుల పోలీస్ కస్టడీ విధించింది. దీంతో నిందితులను ప్రత్యేక బృందాలు కస్టడీలోకి తీసుకుని విచారణ ప్రారంభించాయి. హత్య వెనుక అసలు ఉద్దేశ్యం ఏమిటి..? రాజకీయ కోణం ఉందా..? వ్యక్తిగత విభేదాలా..? లేక ఎవరైనా ప్రేరేపించి హత్య చేయించారా..? అనే అనేక అంశాలపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. నిందితులు వృత్తిపరమైన హంతకులని ప్రాథమిక విచారణలో తేలడంతో కేసు మరింత సంచలనంగా మారింది. వీరికి ఇతర రాష్ట్రాల నేర గ్యాంగ్‌లతో సంబంధాలు ఉన్నాయా అనే కోణంలో కూడా విచారణ కొనసాగుతోంది. గత బుధవారం జరిగిన ఈ హత్య తర్వాత నిందితులు పరారీలోకి వెళ్లిపోయారు. అయితే కోల్‌కతా సమీపంలోని బ్యాలీ టోల్ ప్లాజా వద్ద చేసిన యూపీఐ చెల్లింపు పోలీసులకు కీలక ఆధారంగా మారింది. ఆ డిజిటల్ లావాదేవీల ఆధారంగా పోలీసులు నిందితుల కదలికలను గుర్తించారు.

పశ్చిమ బెంగాల్, ఉత్తర ప్రదేశ్, బీహార్ రాష్ట్రాల పోలీసులు సంయుక్తంగా ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించి విశాల్ శ్రీవాస్తవ, రాజ్ సింగ్, మయాంక్ మిశ్రాలను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, హత్య జరిగిన రాత్రి చంద్రనాథ్ రథ్ తన ఇంటికి కేవలం 200 మీటర్ల దూరంలో ఉన్న సమయంలో దుండగులు దాడికి పాల్పడ్డారు. ఆయన మహీంద్రా స్కార్పియో వాహనం ముందు సీటులో కూర్చుని ఉండగా అత్యంత సమీపం నుంచి కాల్పులు జరిపి హత్య చేశారు. మొదట సిల్వర్ రంగు నిస్సాన్ మైక్రా కారుతో ఆయన వాహనాన్ని అడ్డగించగా, వెంటనే బైక్‌పై వచ్చిన హంతకులు కాల్పులు జరిపినట్లు పోలీసులు తెలిపారు.

దాడి అనంతరం నిందితులు సంఘటన స్థలంలోనే మైక్రా కారును వదిలేసి మరో ఎరుపు రంగు కారు, బైక్‌లపై పారిపోయారు. సీసీటీవీ దృశ్యాలను విశ్లేషించిన పోలీసులు మైక్రా కారును గుర్తించి దాని కదలికలను ట్రాక్ చేశారు. టోల్ ప్లాజా వద్ద జరిగిన యూపీఐ చెల్లింపుల వివరాలు సేకరించి నిందితుల వివరాలను బయటకు తీశారు. ఈ ఆధారాలతో వారిని బీహార్, ఉత్తర ప్రదేశ్ ప్రాంతాల్లో అరెస్ట్ చేశారు. పట్టుబడిన నిందితుల్లో విశాల్ శ్రీవాస్తవపై హత్య, దోపిడీ సహా 15కు పైగా క్రిమినల్ కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ముగ్గురూ కాంట్రాక్ట్ హత్యలు చేసే నేరగాళ్లుగా గుర్తించామని తెలిపారు. ప్రస్తుతం వీరి ఫోన్ కాల్ రికార్డులు, ఆర్థిక లావాదేవీలు, ఇతర సంబంధాలపై పోలీసులు ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ఈ హత్య వెనుక ఉన్న అసలు మాస్టర్‌మైండ్‌ను బయట పెట్టేందుకు దర్యాప్తు వేగవంతం చేశారు.

# నీట్ యూజీ పరీక్షలో ప్రశ్నపత్రం లీక్ కలకలం




దేశవ్యాప్తంగా వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్ యూజీ2026 పరీక్ష చుట్టూ తీవ్ర వివాదం నెలకొంది. ప్రశ్నపత్రం లీక్ జరిగిందనే ఆరోపణలు దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో ఆందోళన రేకెత్తిస్తున్నాయి. రాజస్థాన్‌లో పరీక్షకు ముందే పంపిణీ చేసిన ఓ ప్రాక్టీస్ మెటీరియల్‌లోని ప్రశ్నలు అసలు పరీక్ష ప్రశ్నపత్రంలోని ప్రశ్నలతో భారీగా పోలి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ వ్యవహారం వెలుగులోకి రావడంతో రాజస్థాన్ స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ ప్రత్యేక దర్యాప్తు ప్రారంభించింది. అధికారుల వివరాల ప్రకారం, మే 3న నిర్వహించిన నీట్ యూజీ పరీక్షలో వచ్చిన ప్రశ్నలను పోలిన సుమారు 140 ప్రశ్నలు ఉన్న ఓ ప్రాక్టీస్ పేపర్‌ను గుర్తించారు. ఈ మెటీరియల్ పరీక్షకు రెండు రోజుల ముందే రాజస్థాన్‌లోని సికార్ ప్రాంతంలో అందుబాటులోకి వచ్చినట్లు తెలిసింది. పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఈ ప్రశ్నల సమాహారాన్ని రూ.20 వేల నుంచి రూ.2 లక్షల వరకు విక్రయించినట్లు దర్యాప్తులో బయటపడింది. దీంతో ఇది యాదృచ్ఛిక పోలికనా, లేక అసలు ప్రశ్నపత్రం లీక్ అయిందా అనే అంశంపై అధికారులు లోతుగా విచారణ చేపట్టారు. దర్యాప్తులో మరింత సంచలన విషయాలు బయటపడుతున్నాయి. కొన్ని ప్రశ్నల జవాబుల క్రమం కూడా అసలు ప్రశ్నపత్రంలో ఉన్న విధంగానే ఉండటం అనుమానాలను మరింత పెంచుతోంది. ఈ ప్రాక్టీస్ మెటీరియల్ కేరళలోని ఓ వైద్య కళాశాలలో చదువుతున్న ఎంబీబీఎస్ విద్యార్థికి చెందినదిగా గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. అతడు మే 1న సికార్‌లోని తన స్నేహితుడికి ఈ మెటీరియల్ అందించాడని, ఆ తర్వాత అది కోచింగ్ నెట్‌వర్క్‌లు, పీజీ హాస్టళ్లు, కెరీర్ కౌన్సెలర్లు, అభ్యర్థుల మధ్య విస్తరించినట్లు సమాచారం. ఆ మెటీరియల్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ అంశాలకు సంబంధించిన 300కు పైగా చేతిరాత ప్రశ్నలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ ప్రశ్నలను పరీక్షకు ముందు పలువురు విద్యార్థులు అభ్యసించినట్లు ప్రాథమిక సమాచారం అందింది. దీంతో దేశంలోనే అత్యంత కీలకమైన వైద్య ప్రవేశ పరీక్ష పారదర్శకతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గతంలో కూడా పలు జాతీయ స్థాయి పరీక్షల్లో అవకతవకలు చోటుచేసుకోవడంతో విద్యార్థులు ఈ ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ వ్యవహారంపై నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ స్పందించింది. నీట్ యూజీ2026 పరీక్షకు సంబంధించి అవకతవకలు జరిగాయనే ఆరోపణలు తమ దృష్టికి వచ్చినట్లు ఎన్‌టీఏ వెల్లడించింది. పరీక్ష పూర్తైన నాలుగు రోజుల తర్వాత ఈ సమాచారం అందిందని తెలిపింది. అందిన వివరాలను సంబంధిత దర్యాప్తు సంస్థలకు అప్పగించినట్లు పేర్కొంది. కేసును పారదర్శకంగా విచారించి పూర్తి నిజాలను వెలుగులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చింది. ఇదిలా వుండగా, దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఈ పరీక్ష ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలు నిజమైతే పరీక్షను మళ్లీ నిర్వహించే పరిస్థితులు తలెత్తే అవకాశముందన్న చర్చ కూడా మొదలైంది. విద్యార్థుల భవిష్యత్తుతో సంబంధం ఉన్న ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం, ఎన్‌టీఏ, దర్యాప్తు సంస్థలు తీసుకునే తదుపరి చర్యలపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.

# ఐరన్ డోమ్‌కు భారీ సవాల్



మధ్యప్రాచ్యంలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ లెబనాన్‌కు చెందిన మిలిటెంట్ సంస్థ హెజ్బొల్లా ఇజ్రాయెల్‌కు భారీ షాక్ ఇచ్చినట్లు ప్రకటించింది. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన గగనతల రక్షణ వ్యవస్థలలో ఒకటిగా భావించే ఐరన్ డోమ్ వ్యవస్థలో కీలక భాగమైన మిసైల్ లాంచింగ్ యూనిట్‌ను ఎఫ్‌పీవీ డ్రోన్‌తో ధ్వంసం చేసినట్లు హెజ్బొల్లా వెల్లడించింది. ఈ దాడికి సంబంధించిన వీడియో ఫుటేజీని కూడా విడుదల చేయడంతో అంతర్జాతీయ స్థాయిలో ఈ ఘటనపై చర్చ మొదలైంది. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం ఈ దాడి కొన్నిరోజుల క్రితమే జరిగినట్లు సమాచారం. అయితే దాడి దృశ్యాలను సేకరించి విడుదల చేయడానికి హెజ్బొల్లా కొంత సమయం తీసుకున్నట్లు తెలుస్తోంది. హెజ్బొల్లా చేసిన ప్రకటనపై ఇప్పటివరకు ఇజ్రాయెల్ రక్షణ దళాలు అధికారికంగా స్పందించలేదు. అయినప్పటికీ ఈ ఘటన ఇజ్రాయెల్ భద్రతా వ్యవస్థల సామర్థ్యంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ముఖ్యంగా చిన్న పరిమాణంలో ఉండే ఎఫ్‌పీవీ డ్రోన్లను అడ్డుకోవడం ఇజ్రాయెల్‌కు పెద్ద సవాలుగా మారిందని విశ్లేషకులు చెబుతున్నారు.

సాధారణంగా సంప్రదాయ డ్రోన్లు రేడియో సిగ్నల్స్, జీపీఎస్ వ్యవస్థల ఆధారంగా పని చేస్తాయి. ఈ సిగ్నల్‌స్‌ను జామ్ చేసి వాటిని నిర్వీర్యం చేయడంలో ఇజ్రాయెల్‌కు మంచి నైపుణ్యం ఉంది. అయితే ఎఫ్‌పీవీ డ్రోన్లు పూర్తిగా భిన్నంగా పనిచేస్తాయి. వీటిని ప్రత్యేక ఆప్టిక్ ఫైబర్ కేబుల్ ద్వారా నేరుగా ఆపరేటర్లు నియంత్రిస్తారు. డ్రోన్‌కు అమర్చిన కెమెరా ద్వారా ప్రత్యక్ష దృశ్యాలను చూస్తూ లక్ష్యంపై దాడి చేస్తారు. ఈ తీగల ద్వారా వెళ్లే సంకేతాలను సాధారణ జామర్లు అడ్డుకోలేవు. అందువల్ల ఈ తరహా డ్రోన్లు రక్షణ వ్యవస్థలను సులభంగా ఛేదిస్తున్నాయని సమాచారం. ఇటీవలే ఇజ్రాయెల్ సైన్యంలో ఉన్న ఒక ఉన్నతాధికారి కూడా ఎఫ్‌పీవీ డ్రోన్ల ముప్పుపై హెచ్చరించారు. ఐరన్ డోమ్ వంటి కీలక రక్షణ వ్యవస్థలను ఈ డ్రోన్ల నుంచి రక్షించకపోతే భారీ నష్టం సంభవించే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా తక్కువ ఖర్చుతో తయారయ్యే ఈ డ్రోన్లు అధునాతన రక్షణ వ్యవస్థలకు సవాలు విసురుతున్నాయని సైనిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఇక పరిస్థితిని ఎదుర్కొనేందుకు ఇజ్రాయెల్ పలు రక్షణ చర్యలు చేపడుతోంది. ఐరన్ డోమ్ యూనిట్ల చుట్టూ భారీ వలలను ఏర్పాటు చేస్తోంది. ఈ వలల్లో ఎఫ్‌పీవీ డ్రోన్లు చిక్కుకుని లక్ష్యాన్ని చేరుకోలేవని ఇజ్రాయెల్ భావిస్తోంది. అలాగే కొత్త తరహా యాంటీ డ్రోన్ టెక్నాలజీల అభివృద్ధిపై కూడా దృష్టి సారించినట్లు సమాచారం. ఈ ఘటనతో ఆధునిక యుద్ధాల్లో డ్రోన్ సాంకేతికత ఎంత వేగంగా మారుతోందో మరోసారి స్పష్టమైంది. భారీ మిసైల్ వ్యవస్థలు, అత్యాధునిక రాడార్లు ఉన్నప్పటికీ చిన్న పరిమాణంలో ఉండే ఎఫ్‌పీవీ డ్రోన్లు కొత్త ముప్పుగా ఎదుగుతున్నాయి. భవిష్యత్ యుద్ధాల్లో ఈ టెక్నాలజీ కీలక పాత్ర పోషించే అవకాశం ఉందని రక్షణ రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# లోక్‌సభ సీట్లు 850 చేస్తే అది 'జోక్' అవుతుంది



దేశంలో లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై రాజకీయ చర్చ మరింత వేడెక్కుతోంది. లోక్‌సభ సభ్యుల సంఖ్యను 850కి పెంచే ఆలోచనపై కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశి థరూర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అమెరికాలోని కాలిఫోర్నియాలో నిర్వహించిన స్టాన్‌ఫోర్డ్ ఇండియా కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన ఆయన, లోక్‌సభ సభ్యుల సంఖ్యను 850కి పెంచడం "జోక్" అవుతుందని వ్యాఖ్యానించారు. అలాంటి పరిస్థితి వస్తే భారత పార్లమెంట్ చైనా పీపుల్స్ కన్సల్టేటివ్ కాన్ఫరెన్స్ తరహాలో మారిపోతుందని విమర్శించారు. లోక్‌సభలో సభ్యుల సంఖ్య భారీగా పెరిగితే చర్చలు, వాదోపవాదాలు, ప్రజా సమస్యలపై లోతైన చర్చలకు అవకాశం ఉండదని థరూర్ పేర్కొన్నారు. సభ్యులు కేవలం బల్లలు బాదడానికే పరిమితమవుతారని వ్యాఖ్యానించారు. అమెరికా ఉదాహరణను ప్రస్తావిస్తూ, 1929 నుంచి అక్కడ జనాభా మూడు రెట్లు పెరిగినా హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్ సభ్యుల సంఖ్య మాత్రం 435గానే కొనసాగుతోందని గుర్తుచేశారు. 850 మంది సభ్యులతో సమర్థవంతమైన చర్చలు నిర్వహించడం అసాధ్యమని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్ ప్రక్రియతో ముడిపెట్టకూడదని కూడా శశి థరూర్ స్పష్టం చేశారు. 2027 నుంచి 2029 మధ్య విడుదలయ్యే జనాభా లెక్కల ఆధారంగా మాత్రమే పునర్విభజన చేపట్టాలని సూచించారు. 2034 నాటికి దేశ రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారే అవకాశముందని ఆయన అభిప్రాయపడ్డారు. దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణలో విజయవంతమైనప్పటికీ, పునర్విభజన వల్ల వాటి రాజకీయ ప్రాధాన్యం తగ్గే ప్రమాదం ఉందన్న ఆందోళనలు ఇప్పటికే వ్యక్తమవుతున్నాయి. అదే సమావేశంలో పాల్గొన్న బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య మాత్రం డీలిమిటేషన్‌ను సమర్థించారు. ఇది పూర్తిగా ప్రజాస్వామ్య ప్రక్రియ అని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం దేశ జనాభా 140 కోట్లకు చేరుకున్నప్పటికీ, 1971 జనాభా గణాంకాల ఆధారంగా లోక్‌సభ స్థానాలను కొనసాగించడం సరైన విధానం కాదన్నారు. పార్లమెంట్‌లో ఎంపీల సంఖ్యను 543కే పరిమితం చేయడం వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా లేదని వ్యాఖ్యానించారు. మరో బీజేపీ నేత కే అన్నామలై కూడా ఈ అంశంపై స్పందించారు. డీలిమిటేషన్ వల్ల ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య రాజకీయ సమతౌల్యం మారే అవకాశం ఉందన్నారు. తమిళనాడులో జననాల రేటు తగ్గిపోయిందని, జనాభా లెక్కల ఆధారంగా పునర్విభజన జరిగితే సహజంగానే ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ లోక్‌సభ స్థానాలు వెళ్లే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. దీని వల్ల భవిష్యత్తులో రాజకీయ, పరిపాలనా సమస్యలు తలెత్తే అవకాశముందని హెచ్చరించారు. దేశ రాజకీయాల్లో కీలక అంశంగా మారుతున్న డీలిమిటేషన్‌పై ప్రస్తుతం అన్ని పార్టీల మధ్య విభిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జనాభా ఆధారంగా ప్రాతినిధ్యం పెంచాలన్న వాదన ఒకవైపు ఉంటే, ప్రాంతీయ సమతౌల్యం దెబ్బతింటుందన్న ఆందోళనలు మరోవైపు వ్యక్తమవుతున్నాయి. రాబోయే జనాభా లెక్కలు, కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు దేశ రాజకీయ భవిష్యత్తును ప్రభావితం చేసే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# స్టాలిన్‌ను కలిసిన సీఎం విజయ్



తమిళనాడు రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. తమిళనాడు నూతన ముఖ్యమంత్రి, తమిళగ వెట్రి కళగం పార్టీ అధినేత విజయ్ మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం విజయ్ నేరుగా చెన్నైలోని స్టాలిన్ నివాసానికి వెళ్లడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. తన నివాసానికి వచ్చిన ముఖ్యమంత్రి విజయ్‌కు స్టాలిన్ ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇద్దరూ పరస్పరం ఆలింగనం చేసుకుని స్నేహపూర్వకంగా మాట్లాడుకున్నారు. విజయ్‌ను స్టాలిన్ శాలువాతో సత్కరించారు. ఈ సమావేశంలో స్టాలిన్ కుమారుడు, మాజీ మంత్రి ఉదయనిధి స్టాలిన్ కూడా పాల్గొన్నారు. ఈ భేటీకి సంబంధించిన చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

తమిళనాడు రాజకీయాల్లో ఇటీవల జరిగిన పరిణామాల నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. డీఎంకే మిత్రపక్షాలైన కాంగ్రెస్, వీడుదల చిరుతైగళ్ కచ్చి, భారత కమ్యూనిస్టు పార్టీ, మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీలు టీవీకే ప్రభుత్వానికి మద్దతు ప్రకటించాయి. ఈ విషయంలో స్టాలిన్ తమ మిత్రపక్షాలకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వడం విజయ్ ప్రభుత్వ ఏర్పాటుకు పరోక్షంగా సహకరించినట్లుగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన తర్వాత విజయ్, స్టాలిన్‌ను ప్రత్యేకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరించిన తర్వాత విజయ్ స్టాలిన్‌ను కలవడం ఇదే తొలిసారి కావడం కూడా ఈ భేటీకి మరింత ప్రాధాన్యం తీసుకొచ్చింది. తమిళనాడులో ప్రస్తుతం రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్న పరిస్థితుల్లో ఈ సమావేశం భవిష్యత్ రాజకీయ పరిణామాలకు సంకేతమా అనే చర్చ కూడా మొదలైంది. డీఎంకే, టీవీకే మధ్య భవిష్యత్తులో సహకారం మరింత బలపడే అవకాశాలపై రాజకీయ వర్గాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి. అయితే ఈ భేటీ పూర్తిగా మర్యాదపూర్వక సమావేశమేనని, రాష్ట్ర అభివృద్ధి, రాజకీయ పరిస్థితులపై సాధారణ చర్చ మాత్రమే జరిగినట్లు సమాచారం. అయినప్పటికీ తమిళ రాజకీయాల్లో ఈ సమావేశం కొత్త చర్చలకు దారి తీసింది.

# సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణాన్ని నెహ్రూ వ్యతిరేకించారు



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పై తీవ్ర విమర్శలు చేశారు. స్వాతంత్ర్యానంతరం గుజరాత్‌లోని సోమనాథ్ ఆలయం పునర్నిర్మాణాన్ని నెహ్రూ వ్యతిరేకించారని ఆరోపించారు. జాతీయ ఆత్మగౌరవం కంటే బుజ్జగింపు రాజకీయాలకు ప్రాధాన్యం ఇచ్చే శక్తులు ఇప్పటికీ దేశంలో ఉన్నాయని పేర్కొంటూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణం జరిగి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన 'సోమనాథ్ అమృత్ మహోత్సవ్' కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1951లో జరిగిన సోమనాథ్ ఆలయ పునఃప్రతిష్ఠ భారతదేశ స్వతంత్ర నాగరిక స్పృహకు ప్రతీకగా నిలిచిందన్నారు. స్వాతంత్ర్యానంతరం ఆలయ పునర్నిర్మాణానికి అంకితభావంతో కృషి చేసిన సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్, తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ సేవలను ప్రధాని ప్రత్యేకంగా ప్రశంసించారు. "500కు పైగా సంస్థానాలను ఏకం చేసి ఆధునిక భారత నిర్మాణానికి పునాది వేసిన సర్దార్ పటేల్, సోమనాథ్ పునర్నిర్మాణం ద్వారా మన ప్రాచీన వైభవాన్ని తిరిగి పొందుతున్నామనే సందేశాన్ని ప్రపంచానికి ఇచ్చారు" అని మోదీ పేర్కొన్నారు. అయితే ఈ మహత్తర కార్యానికి నెహ్రూ నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైందని ఆరోపించారు. "సర్దార్ పటేల్, రాజేంద్ర ప్రసాద్ ఎంతో కృషి చేసినా, వారికి నెహ్రూ జీ నుంచి వ్యతిరేకత వచ్చిందన్న విషయం అందరికీ తెలుసు. ఆ వివరాల్లోకి ఇప్పుడు వెళ్లడం లేదు. కానీ సర్దార్ పటేల్ సంకల్పం ముందు ఏదీ నిలవలేదు" అని వ్యాఖ్యానించారు. ఈ చారిత్రక అంశాన్ని ప్రస్తుత రాజకీయ పరిస్థితులతో ముడిపెడుతూ ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. "జాతీయ ఆత్మగౌరవం కంటే బుజ్జగింపు రాజకీయాలను ముందుకు పెట్టే శక్తులు ఇప్పటికీ ఉన్నాయి. అయోధ్యలో రామమందిర నిర్మాణం సమయంలో కూడా ఇదే తరహా వ్యతిరేకత కనిపించింది" అని అన్నారు. సంకుచిత రాజకీయాలను దాటి దేశం అభివృద్ధి, వారసత్వాన్ని కలిపి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గత పదేళ్లలో తమ ప్రభుత్వం దేశ సాంస్కృతిక పునరుజ్జీవనానికి కట్టుబడి పనిచేస్తోందని ప్రధాని తెలిపారు. కాశీ విశ్వనాథ్ ధామ్, మహాకాల్ మహాలోక్, కేదార్‌నాథ్ ఆలయం పునర్నిర్మాణ ప్రాజెక్టులను ఉదాహరణగా ప్రస్తావించారు. ఈ కార్యక్రమాలు కేవలం గతాన్ని గుర్తు చేసుకోవడానికే కాకుండా, రాబోయే వెయ్యేళ్ల భారత నిర్మాణానికి స్ఫూర్తినిచ్చే వేదికలని అభివర్ణించారు. అంతకుముందు ప్రధాని మోదీ సోమనాథ్ ఆలయంలో జరిగిన కుంభాభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి దేశ శాంతి, అభివృద్ధి కోసం ప్రార్థనలు చేశారు.

# రూ. కోటి విలువైన డుకాటీ స్పెషల్ బైక్



ఇటాలియన్ ప్రీమియం మోటార్‌సైకిల్ తయారీ సంస్థ అత్యంత ప్రత్యేకమైన పరిమిత ఎడిషన్ సూపర్ బైక్ 'పనిగేల్ వీ4 లంబోర్గిని'ను భారత మార్కెట్లో ప్రవేశపెట్టింది. ఈ బైక్ ఎక్స్‌షోరూమ్ ధర రూ.1 కోటిగా నిర్ణయించారు. ఈ లిమిటెడ్ ఎడిషన్ బైక్‌కు సంబంధించిన బుకింగ్స్ ఇప్పటికే పూర్తయ్యాయని సంస్థ వెల్లడించింది. మొదటి బైక్‌ను ముంబైలో కస్టమర్‌కు డెలివరీ చేసినట్లు తెలిపింది.

ప్రపంచవ్యాప్తంగా ఈ ప్రత్యేక ఎడిషన్‌లో కేవలం 630 యూనిట్లను మాత్రమే తయారు చేస్తున్నట్లు డుకాటీ పేర్కొంది. దీంతో భారత్‌కు వచ్చిన అత్యంత అరుదైన సూపర్ బైక్‌లలో ఇది ఒకటిగా నిలిచింది.

ఇంకా ప్రత్యేకంగా 'స్పెషాలీ క్లయింటి' పేరుతో మరో ఎడిషన్‌ను కూడా సంస్థ రూపొందిస్తోంది. ఇందులో ప్రపంచవ్యాప్తంగా కేవలం 63 యూనిట్లను మాత్రమే ఉత్పత్తి చేయనున్నారు. ఈ ఎడిషన్‌ను ప్రత్యేకంగా లంబోర్గిని కార్ల యజమానుల కోసం తయారు చేస్తున్నారు. తమ కార్ల రంగులకు అనుగుణంగా బైక్‌ను అనుకూలీకరించుకునే అవకాశం కూడా కల్పిస్తున్నారు.

డుకాటీ పనిగేల్ వీ4 ఎస్ ఆధారంగా రూపొందించిన ఈ బైక్‌కు లంబోర్గిని రెవుయెల్టో సూపర్‌కార్ నుంచి ప్రేరణ తీసుకున్నట్లు సంస్థ తెలిపింది. డుకాటీ, లంబోర్గిని కలిసి రూపొందించిన మూడో ప్రత్యేక మోడల్ ఇదే కావడం విశేషం.

బైక్ రూపకల్పనలో కార్బన్ ఫైబర్‌ను విస్తృతంగా ఉపయోగించారు. ఫెయిరింగ్, మడ్ గార్డులు, హీల్ గార్డులు, ట్యాంక్ ప్రొటెక్షన్, ఎగ్జాస్ట్ కవర్, రేడియేటర్ డక్ట్ వంటి భాగాలను కార్బన్ ఫైబర్‌తో తయారు చేయడం వల్ల బరువు గణనీయంగా తగ్గినట్లు కంపెనీ వెల్లడించింది.

ఈ బైక్‌లో 1,103 సీసీ డెస్మోసెడిసి స్ట్రాడేల్ వీ4 ఇంజిన్‌ను అమర్చారు. దీనికి 6 స్పీడ్ గేర్‌బాక్స్‌తో పాటు స్లిప్పర్ డ్రై క్లచ్‌ను అందించారు. మొత్తం బరువు 185 కిలోలుగా ఉండే ఈ బైక్, పనిగేల్ సిరీస్‌లో అత్యంత తేలికైన మరియు అత్యంత శక్తివంతమైన మోడల్‌గా నిలుస్తుందని సంస్థ పేర్కొంది.

## నిత్యావసరాల ధరలు మళ్లీ పెరిగే సూచనలు

దేశంలో ఇప్పటికే పెరుగుతున్న ధరలతో ఇబ్బందులు పడుతున్న సామాన్య ప్రజలకు మరో షాక్ తగిలే అవకాశాలు కనిపిస్తున్నాయి. సబ్బులు, డిటర్జెంట్లు, బిస్కెట్లు, ప్యాకేజ్డ్ ఆహార పదార్థాలు వంటి నిత్యావసర వస్తువుల ధరలను మరోసారి పెంచేందుకు ఎఫ్ఎమ్‌సీజీ సంస్థలు సిద్ధమవుతున్నాయి. ఇంధన వ్యయాలు, ప్యాకేజింగ్ ఖర్చులు, ముడి చమురు ధరలు పెరగడం, అంతర్జాతీయ భౌగోళిక ఉద్రిక్తతలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయని తయారీ సంస్థలు పేర్కొంటున్నాయి. ఈ కారణాల వల్ల ధరల పెంపు తప్పడం లేదని అవి వెల్లడిస్తున్నాయి. ఇప్పటికే పలు సంస్థలు తమ ఉత్పత్తుల ధరలను మూడు నుంచి ఐదు శాతం వరకు పెంచాయి. చిన్న ధరల ప్యాకెట్లను అలాగే ఉంచి, మిగతా ఉత్పత్తుల ధరలను పెంచడం లేదా పరిమాణాన్ని తగ్గించడం వంటి చర్యలను పరిశీలిస్తున్నాయి. డాబర్ ఇండియా ఇప్పటికే తమ ఉత్పత్తుల ధరలను నాలుగు శాతం పెంచినట్లు తెలిపింది. బ్రిటానియా సంస్థ కూడా త్వరలో కొన్ని ఉత్పత్తుల ధరలను పెంచనున్నట్లు సంకేతాలు ఇచ్చింది. హిందూస్థాన్ యూనిలివర్ లిమిటెడ్ కూడా ముడి సరుకుల ధరలు పెరుగుతుండటంతో సబ్బులు, డిటర్జెంట్ల ధరలను పెంచాల్సి వచ్చే అవకాశముందని పేర్కొంది. ఫెవికాల్ తయారీ సంస్థ పిడిలైట్ ఇండస్ట్రీస్ కూడా ధరల పెంపు దిశగా అడుగులు వేస్తోంది. కొబ్బరి నూనె, వంట నూనెలను విక్రయించే మారికో సంస్థ ఇప్పటికే తమ ఉత్పత్తుల ధరలను ఆరు నుంచి ఏడు శాతం వరకు పెంచింది.

ఇదే సమయంలో కమర్షియల్ ఎల్పీజీ ధరలు పెరగడం కూడా వ్యాపార రంగంపై అదనపు భారం మోపుతోంది. పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరుగుతుండటంతో త్వరలో దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు కూడా పెరిగే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. ఇంధన ధరలు పెరిగితే రవాణా వ్యయాలు మరింత పెరిగి, దాని ప్రభావం నిత్యావసర వస్తువుల ధరలపై కూడా పడే అవకాశముందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.




## తక్కువ ధరకే బీఎస్ఎన్ఎల్ డేటా ప్లాన్

ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ వినియోగదారులను ఆకట్టుకునేందుకు రూ.225 ధరలో కొత్త ప్రీపెయిడ్ ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. తక్కువ ఖర్చుతో ఎక్కువ డేటా, పూర్తి నెల వ్యాలిడిటీ కోరుకునే కస్టమర్లను దృష్టిలో పెట్టుకుని ఈ ప్లాన్‌ను రూపొందించినట్లు సంస్థ తెలిపింది.

ఈ ప్లాన్‌లో భాగంగా వినియోగదారులకు రోజుకు 2.5 జీబీ హైస్పీడ్ డేటా లభిస్తుంది. మొత్తం 30 రోజుల వ్యాలిడిటీతో సుమారు 75 జీబీ డేటాను వినియోగించుకునే అవకాశం ఉంటుంది. రోజువారీ డేటా పరిమితి పూర్తైన తర్వాత కూడా ఇంటర్నెట్ సేవలు కొనసాగుతాయని, అయితే వేగం తగ్గుతుందని సంస్థ పేర్కొంది. డేటాతో పాటు అన్ని నెట్‌వర్క్‌లకు అపరిమిత వాయిస్ కాల్స్ సౌకర్యాన్ని కూడా ఈ ప్లాన్‌లో కల్పించారు. అదనంగా రోజుకు 100 ఎస్ఎంఎస్‌ల ప్రయోజనం కూడా లభిస్తుంది. ఈ ప్లాన్‌లో ప్రధాన ఆకర్షణ 30 రోజుల పూర్తి వ్యాలిడిటీ. ప్రస్తుతం అనేక ప్రైవేట్ టెలికాం సంస్థలు 28 రోజుల ప్లాన్‌లను అందిస్తుండగా, బీఎస్ఎన్ఎల్ మాత్రం పూర్తి నెల కాలపరిమితిని ఇస్తోంది. తక్కువ ధరకే ఎక్కువ డేటా అవసరమయ్యే వినియోగదారులకు ఈ ప్లాన్ మంచి ఎంపికగా నిలుస్తుందని టెలికాం వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## గల్ఫ్ ఉద్రిక్తతలతో మార్కెట్ ఆందోళన

దేశీయ స్టాక్ మార్కెట్లపై ఈ వారం కూడా గల్ఫ్ దేశాల పరిణామాల ప్రభావం ప్రధానంగా కనిపించే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. ముఖ్యంగా అమెరికాఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు మదుపర్లలో ఆందోళన పెంచుతున్నాయి.

గత వారం తీవ్ర ఒడిదుడుకుల మధ్య సెన్సెక్స్ 414 పాయింట్లకు పైగా పెరిగి 77,328 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 178 పాయింట్లు లాభపడి 24,176 స్థాయిలో స్థిరపడింది. అయితే అంతర్జాతీయ పరిస్థితులు ఇంకా అనిశ్చితంగానే ఉండటంతో ఈ వారం మార్కెట్లలో హెచ్చుతగ్గులు కొనసాగవచ్చని విశ్లేషకులు చెబుతున్నారు.




అమెరికా, ఇజ్రాయెల్ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గి శాంతి చర్చలు ముందుకు సాగితే మార్కెట్లు మరింత పుంజుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. అయితే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వైఖరిలో స్పష్టత లేకపోవడం, ఇరాన్ కూడా గట్టిగా స్పందించడం పరిస్థితిని మరింత క్లిష్టంగా మారుస్తున్నాయి. ఇరువైపులా సైనిక చర్యలకు సిద్ధమవుతున్నారనే వార్తలతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. దీనివల్ల దేశీయ మార్కెట్లపై అమ్మకాల ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఇక జనవరిమార్చి త్రైమాసికానికి సంబంధించిన ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ఆర్థిక ఫలితాలు కూడా ఈ వారం ట్రేడింగ్‌ను ప్రభావితం చేయనున్నాయి. గ్లోబల్ మార్కెట్ల ధోరణి, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ, విదేశీ మదుపర్ల పెట్టుబడుల కదలికలు కూడా కీలకంగా మారనున్నాయి.

అమ్మకాల ఒత్తిడి పెరిగితే నిఫ్టీకి 23,800 స్థాయి ముఖ్య మద్దతుగా ఉండొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఆ స్థాయి కంటే దిగువకు పడిపోతే 23,500 వరకు దిగజారే అవకాశముందని చెబుతున్నారు. మరోవైపు కొనుగోళ్లు పెరిగితే నిఫ్టీ 24,400 నుంచి 24,700 పాయింట్ల వరకు వెళ్లే అవకాశముందని అభిప్రాయపడుతున్నారు.

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు ఎప్పుడూ రిస్క్‌తో కూడుకున్నవేనని, అంతర్జాతీయ పరిణామాలు మార్కెట్లపై ప్రభావం చూపుతుంటాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు.

## ప్రయాణికులకు ఉపయోగకరమైన క్రెడిట్ కార్డులు

తరచుగా దేశీయ, విదేశీ ప్రయాణాలు చేసే వారికి సరైన క్రెడిట్ కార్డు ఎంపిక ఎంతో ఉపయోగకరంగా మారుతోంది. సరైన కార్డు ద్వారా విమానాశ్రయ విశ్రాంతి గదుల వినియోగం, విదేశీ ఖర్చులపై తక్కువ చార్జీలు, ప్రయాణ బుకింగ్స్‌పై రివార్డు పాయింట్లు వంటి అనేక ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుంది.




ప్రస్తుతం ప్రయాణికులను ఎక్కువగా ఆకట్టుకుంటున్న కార్డుల్లో ఫెడరల్ బ్యాంక్ స్కాపియా క్రెడిట్ కార్డు ఒకటి. ఈ కార్డు ద్వారా విదేశీ లావాదేవీలపై అదనపు మారకపు చార్జీలు లేకపోవడం ప్రధాన ప్రత్యేకతగా నిలుస్తోంది.

అలాగే ఇక్సిగో ఏయూ క్రెడిట్ కార్డు ద్వారా విమాన, రైలు టికెట్ బుకింగ్స్‌పై ప్రత్యేక రాయితీలు, రివార్డు పాయింట్లు లభిస్తున్నాయి.

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ వావ్ బ్లాక్ క్రెడిట్ కార్డు ద్వారా ఖర్చులపై అధిక రివార్డు పాయింట్లు సంపాదించే అవకాశం ఉంటుంది. ప్రయాణాలకు సంబంధించిన ఖర్చులపై అదనపు ప్రయోజనాలు కూడా అందుబాటులో ఉంటాయి. బ్యాంక్ ఆఫ్ బరోడా ఎటెర్నా కార్డు ద్వారా విమానాశ్రయ విశ్రాంతి గదుల ప్రవేశం, భోజన ఖర్చులపై ప్రత్యేక ఆఫర్లు, ప్రయాణ ప్రయోజనాలు లభిస్తున్నాయి.

హెచ్‌డీఎఫ్‌సీ మారియట్ బోన్వాయ్ క్రెడిట్ కార్డు హోటల్ బుకింగ్స్ ఎక్కువగా చేసే వారికి ఉపయోగకరంగా ఉంటుంది. హోటల్ వసతి, ప్రయాణ బుకింగ్స్‌పై రివార్డు పాయింట్లు, ప్రత్యేక రాయితీలు అందుబాటులో ఉంటాయి.

ప్రయాణ అవసరాలు, ఖర్చుల విధానాన్ని బట్టి సరైన క్రెడిట్ కార్డు ఎంపిక చేసుకుంటే ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు ప్రయాణ అనుభవాన్ని మరింత సౌకర్యవంతంగా మార్చుకోవచ్చని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# రామ్‌పై వైష్ణవి క్రష్

'బేబి' సినిమాతో టాలీవుడ్‌లో సంచలన విజయాన్ని అందుకున్న యువ నటి వైష్ణవి చైతన్య తాజాగా చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. హీరో రామ్ పోతినేనిపై తనకున్న అభిమానాన్ని ఆమె బహిరంగంగా వ్యక్తం చేయడంతో అభిమానుల్లో ఆసక్తికర చర్చ మొదలైంది. ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన వైష్ణవి చైతన్య, చిన్నప్పటి నుంచే రామ్ అంటే తనకు చాలా ఇష్టమని తెలిపింది. ఆయన ఉత్సాహం, తెరపై కనిపించే తీరు తనను బాగా ఆకట్టుకుంటాయని చెప్పింది. ఒక రకంగా రామ్ తనకు క్రష్ అని కూడా స్పష్టంగా వెల్లడించింది. రామ్ నటించిన సినిమాలను తాను క్రమం తప్పకుండా చూస్తానని, భవిష్యత్తులో ఆయనతో కలిసి నటించే అవకాశం వస్తే అసలు వదులుకోనని వైష్ణవి పేర్కొంది. సాధారణంగా హీరోయిన్లు ఇలాంటి విషయాలు బయటపెట్టడానికి సంకోచిస్తుంటారు. అయితే వైష్ణవి మాత్రం ఎంతో సరళంగా తన అభిప్రాయాన్ని చెప్పడం అభిమానులను ఆకట్టుకుంది.

ఈ వ్యాఖ్యలతో రామ్ అభిమానులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. "రామ్ – వైష్ణవి కాంబినేషన్‌లో సినిమా వస్తే చూడాలని ఉంది" అంటూ సామాజిక మాధ్యమాల్లో కామెంట్లు చేస్తున్నారు. వీరిద్దరి ఉత్సాహభరితమైన నటన తెరపై మంచి జోడీగా నిలుస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

'బేబి' సినిమా విజయంతో వైష్ణవి చైతన్యకు వరుస అవకాశాలు వస్తున్నాయి. ప్రస్తుతం ఆమె ఆనంద్ దేవరకొండతో మరో చిత్రంలో నటిస్తున్నట్లు సమాచారం. సహజ నటనతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన వైష్ణవి, రాబోయే రోజుల్లో స్టార్ హీరోయిన్‌గా ఎదిగే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

హైదరాబాద్ పాతబస్తీ ప్రాంతంలో పెరిగిన వైష్ణవి చైతన్య, మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చారు. సినిమాల్లోకి రాకముందు యూట్యూబ్ షార్ట్ ఫిలిమ్స్, వెబ్ సిరీస్‌ల ద్వారా మంచి గుర్తింపు సంపాదించారు. ముఖ్యంగా 'సాఫ్ట్‌వేర్ డెవలపర్' వెబ్ సిరీస్ ఆమెకు విపరీతమైన ఆదరణ తెచ్చిపెట్టింది. ఆ తర్వాత 'అల వైకుంఠపురములో' వంటి చిత్రాల్లో చిన్న పాత్రల్లో కనిపించిన ఆమెకు 'బేబి' చిత్రం కెరీర్‌లో పెద్ద మలుపు తీసుకొచ్చింది. ఈ సినిమాలో ఆమె నటనకు ప్రేక్షకులతో పాటు విమర్శకుల ప్రశంసలు కూడా దక్కాయి.



## నా సినిమాల్లో కథే హీరో – సమంత

హీరోయిన్ సమంత సోషల్ మీడియాలో ఎప్పుడూ ఫ్యాన్స్‌తో టచ్‌లో ఉంటుంది. ఇదే క్రమంలో ఇటీవల జరిగిన ఓ మ్యాగజైన్ కవర్ షూటింగ్ సమయంలో ఎదురైన ప్రశ్నలకుగానూ సమంత తన పాత్రల ఎంపిక గురించి పలు ఇంట్రెస్టింగ్ విషయాలు చెప్పుకొచ్చింది. సమంత మాట్లాడుతూ.. 'నేను చేసే సినిమాల్లో కథే హీరో అవుతుంది. కథ.. నిర్మాత, నటీనటుల కంటే గొప్పది. సమాజంలో మహిళలకు సరైన ప్రాతినిధ్యం ఉండాలనేది నా భావన' అని సామ్ తెలిపింది. సమంత ఇంకా మాట్లాడుతూ.. 'సినిమాలు చూస్తున్న మహిళలు ఆ సినిమాల్లోని పాత్రలతో మమేకం అవ్వాలి. తమను కూడా గుర్తించారని వారు భావించేలా అవి ఉండాలి. ఇకపై అలాంటి చిత్రాల్లోనే భాగం కావాలనుకుంటున్నాను. ఇక 'మా ఇంటి బంగారం' చిత్రాన్ని అత్యంత వినోదాత్మకంగా, కుటుంబం మొత్తం ఆస్వాదించేలా తీర్చిదిద్దాం'' అని సమంత చెప్పుకొచ్చింది. మరి మా ఇంటి బంగారం సినిమాతో సామ్ ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి



## ప్రధాని మోదీకి ప్రామిస్ చేశా – అన్నా లెజినోవా

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సతీమణి అన్నా లెజినోవా పెట్టిన ఓ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇటీవల శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న పవన్‌ను కలిశారు మోదీ. నిన్న ఆదివారం ప్రధాని హైదరాబాద్ పర్యటన సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని పవన్ కల్యాణ్ నివాసానికి వెళ్లారు. ఈ క్రమంలో పవన్, ఆయన సతీమణి అన్నా కొణిదెల ప్రధానికి సాదర స్వాగతం పలికారు. కాగా అన్నా లెజినోవా, మోదీతో ఉన్న ఫొటోలను పంచుకుంటూ.. 'ప్రధాని మోదీ మా ఇంటికి వచ్చారు. ఎంతో ఆనందంగా ఉంది. ఈ రోజును జీవితంలో మర్చిపోలేను. నా భర్తను జాగ్రత్తగా చూసుకుంటానని ఆయనకు నేను ప్రామిస్ చేశాను'' అని ఆ ఫొటోలకు అన్నా లెజినోవా ఓ క్యాప్షన్ కూడా పెట్టారు. ప్రస్తుతం ఈ పిక్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. మరోవైపు పవన్ ఇంటికి వెళ్లిన విషయాన్ని తెలుపుతూ మోదీ కూడా ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు.

## 'లెనిన్' లేటెస్ట్ అప్ డేట్ !




అక్కినేని యంగ్ హీరో అఖిల్ ప్రస్తుతం తన లెనిన్ చిత్రాన్ని దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరి (నందు) డైరెక్షన్ లో చేస్తున్నాడు. కాగా ఈ సినిమా సెకండ్ హాఫ్ లో ఓ స్పెషల్ ఎపిసోడ్ ఉందట. ఈ ఎపిసోడ్ కోసం మురళీ కిషోర్ అబ్బూరి ఓ స్పెషల్ రోల్ ను డిజైన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో జరిగిన షెడ్యూల్ లో ఈ ఎపిసోడ్ కి సంబంధించి కొన్ని సీన్స్ ను షూట్ చేశారు. మరో ఈ రోల్ లో ఎవరు నటించారో చూడాలి.కాగా ఈ సినిమా.. రాయలసీమ బ్యాక్ డ్రాప్ తో చిత్తూరు ప్రాంతం నేపథ్యంలో తెరకెక్కుతుంది. ఇక ఈ సినిమాలో అందాల భామ భాగ్య శ్రీ బోర్సే హీరోయిన్ గా నటిస్తోంది. ఇక సినిమా పై భారీ అంచనాలు ఉన్నాయి. ముఖ్యంగా అఖిల్ – భాగ్య శ్రీ కలయికలో లవ్ సీన్స్ చాలా బాగుంటాయట. అన్నట్టు ఈ సినిమా పై అఖిల్ చాలా హోప్స్ పెట్టుకున్నాడు. సినిమా అవుట్ పుట్ అయితే బాగా వస్తోందని టీమ్ చెబుతుంది. మరి ఈ సినిమాతో అఖిల్ హిట్ కొడతాడో లేదో చూడాలి.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in